


# వేల కోట్లు దోచేశారు..!

**(మొదటి పేజీ తరువాయి)**

చేసేది మరొకటి అని రిపోర్టు తేటతెల్లం చేసింది. అంచనాలకు, చేస్తున్న ఖర్చులకు ఏమాత్రం పొంతనలేకుండా ఉంది. సంక్షేమ రంగానికి,

**ఫిర్యాదుల్లో జాప్యంతో నష్టం**

సైబర్ నేరాలను నియంత్రించేందుకు కేంద్రం ప్రత్యేకంగా ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (I4C) ఏర్పాటు చేసింది. మోసం జరిగిన వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేస్తే డబ్బు మరింత దారి మళ్లకుండా అడ్డుకునే అవకాశం ఉంటుంది. అయితే చాలామంది ఆలస్యంగా ఫిర్యాదు చేయడంతో నష్టాలు పెరుగుతున్నాయి.

**రూ.55 వేల కోట్ల నష్టం**

2020 నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా సైబర్ నేరాల వల్ల సుమారు రూ.55 వేల కోట్ల నష్టం సంభవించింది. అందులో రూ.8,690 కోట్లను మాత్రమే తిరిగి పొందగలిగారు. మిగతా డబ్బును నేరగాళ్లు వివిధ మార్గాల్లో మాయంచేశారు. 252 కీలక కేసుల్లోనే రూ.35,925 కోట్లకు పైగా నగదు మళ్లింపును ఈడీ గుర్తించింది.

**ఖాతాదారులపై విచారణ**

సైబర్ నేరాలకు సంబంధించిన లావాదేవీలు ఎక్కువగా బ్యాంకు ఖాతాల ద్వారానే జరిగాయని గుర్తించిన అధికారులు, ఆ ఖాతాదారులతో నేరగాళ్లకు ఉన్న సంబంధాలపై ఆరా తీస్తున్నారు. డబ్బు చివరకు ఎవరి ఖాతాలో జమైందో, ఆ సొమ్మును ఎలా వినియోగించారో తెలుసుకునేందుకు విచారణ చేపట్టనున్నారు.

**ఆస్తుల జప్తు, బాధితులకు న్యాయం**

నేరగాళ్లు కూడబెట్టుకున్న ఆస్తులను జప్తు చేసి, న్యాయస్థానం ఆదేశాల మేరకు బాధితులకు పంపిణీ చేయడమే ఈడీ ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. క్రిప్టో రూపంలో విదేశాలకు తరలించిన నిధులపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం. ఇటీవల భారీ స్థాయిలో సైబర్ మోసాలు వెలుగులోకి రావడం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది.

# మూడు రోజుల పాత బిర్యానీ డెలివరీ

**హైదరాబాద్, ఏప్రిల్ 7:**

నేటి ఆధునిక జీవన విధానంలో స్మార్ట్ ఫోన్ వినియోగం పెరగడంతో ఫుడ్ డెలివరీ యాప్‌ల ద్వారా ఆహారం ఆర్డర్ చేయడం సాధారణంగా మారింది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని అనేక హోటళ్లు తమ వ్యాపారాన్ని విస్తరిస్తున్నాయి. అయితే కొంతమంది వ్యాపారులు నాణ్యతను పట్టించుకోకుండా వినియోగదారుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ చేసిన బిర్యానీ కుళ్లిపోయిన స్థితిలో డెలివరీ కావడంతో హోటల్ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజుల క్రితం తయారుచేసిన ఆహారాన్ని ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచి, ఆర్డర్ వచ్చినప్పుడు వేడి చేసి పంపిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బంజారాహిల్స్ రోడ్ నెంబర్2 ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం ఉదయం Zomato యాప్ ద్వారా చికెన్ బిర్యానీ ఆర్డర్ చేశారు. అదే ప్రాంతంలోని "లక్కీ బిర్యానీ షావర్మ" రెస్టారెంట్ నుంచి వచ్చిన బిర్యానీ పొట్లం తెరిచి చూడగా దుర్వాసన రావడంతో అనుమానం వ్యక్తమైంది. పరిశీలించగా బిర్యానీ కుళ్లిపోయినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు హోటల్‌లో తనిఖీలు చేపట్టగా పలు అనుమానాస్పద విషయాలు బయటపడ్డాయి. ఫ్రిడ్జ్‌లో సుమారు 80 బిర్యానీ ప్యాకెట్లు నిల్వ ఉంచినట్లు గుర్తించారు. అలాగే ఫ్రిడ్జ్‌లో ఎలుకలు సంచరిస్తున్న దృశ్యాలు కూడా కనిపించాయి. దర్యాప్తులో భాగంగా జీడిమెట్ల ప్రాంతానికి చెందిన హోటల్ యజమాని ఇర్ఫాన్ మూడు రోజుల క్రితం తయారుచేసిన బిర్యానీని ప్యాకెట్లుగా సిద్ధం చేసి బంజారాహిల్స్ అవుట్‌లెట్‌లో నిల్వ ఉంచి, ఆర్డర్ వచ్చినప్పుడు వేడి చేసి పంపిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. అపరిశుభ్ర పరిస్థితులు, దుర్వాసనలు, ఎలుకలు, బొద్దింకలతో నిండిన ఆ హోటల్‌ను అధికారులు సీజ్ చేశారు. అలాగే హోటల్ యజమాని ఇర్ఫాన్‌పై కేసు నమోదు చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడా తనిఖీలు నిర్వహించి ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నగరంలో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ వ్యాపారులపై పోలీసులు నిఘా పెంచారు. నిబంధనలను అతిక్రమించి వ్యాపారం నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా పాడైన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిసిన వెంటనే HFAST నంబర్ 8712661212కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.



# రేవంత్‌ది గడీల, బేడీల, గుడ్డి పాలన

**హైదరాబాద్, ఏప్రిల్ 7:**

పరిగిలో భూముల లాక్కొని తన సోదరుడికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై బీఆరఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు నిప్పులు చెరిగారు. ఆరు గ్యారెంటీలు వంద రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.. 900 రోజులైనా ఎందుకు పూర్తి చేయలేదంటూ సూటిగా ప్రశ్నించారు. శంషాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ రేవంత్.. నువ్వు మళ్ళీ గెలవడం కాదు కదా ప్రతిపక్ష హోదా కూడా నీ పార్టీకి రాదని జోస్యం చెప్పారు. ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని చెప్పారు. పరిగిలో రైతులను పరామర్శించేందుకు వెళ్తుంటే తమను అరెస్టు చేశారన్నారు. రేవంత్ రెడ్డిది గడీల పాలన.. బేడీల పాలన.. గుడ్డి పాలన అంటూ అభివర్ణించారు. సాగుకు పనికిరాని భూముల్లో పరిశ్రమలు పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులు సాగు చేసుకుంటున్న భూములను ఎందుకు లాక్కుంటున్నారంటూ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. బోగస్ మాటలు.. బోగస్ పాలన అంటూ రేవంత్ పరిపాలనను ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి మించిన రావణాసురుడు ఎవరైనా ఉన్నారా అని ఈ సందర్భంగా హరీష్ రావు ప్రశ్నించారు. పోలీసు నిర్బంధం, అణచివేతల మధ్య హరీష్‌రావు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర రెడ్డి, దివాకర్ రావు, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల దయాకర్‌రావులతో కలిసి పరిగి రైతుల వద్దకు బయల్దేరారు. మార్గంమధ్యలో అప్పా జంక్షన్ వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. హరీష్‌రావు కాన్వాయ్ ముందుకు వెళ్లకుండా లారీలను రోడ్డు□□డ్డంగా పెట్టారు. హరీష్‌రావును అరెస్టు చేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆరఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. బీఆరఎస్ శ్రేణులు రోడ్డుపై



బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో అప్పా జంక్షన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. వారందరినీ శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**రేవంత్ ఆలోచనలన్నీ భూముల చుట్టూనే.**

సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతది అన్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలు అన్నీ భూమి చుట్టే తిరుగుతున్నయి అని అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు వ్యాఖ్యానించారు. లగచర్ల అంటడు.. హెచ్‌సీయూ అంటడు.. హిల్‌టప్ అంటడు.. నాదర్‌గుల్ భూములు అంటడు.. ఇవ్వాళ పరిగిలో భూములు లాక్కుంటడు.. పాలన చేయమంటే భూముల మీద పడ్డడు అని విమర్శించారు. నాటి ఇందిరమ్మ భూములు ఇస్తే నేటి ఇందిరమ్మ పాలనలో పేదల భూములు లాక్కుంటున్నడన్నారు. పరిగి నియోజకవర్గంలో దళిత, గిరిజన బలహీనవర్గాల భూములను ఇండస్ట్రియల్ పార్కుల పేరిట ప్రభుత్వం గుంజుకునే ప్రయత్నం చేస్తున్నదని, రైతుల పక్షాన పోరాడటానికి తమ నాయకులు వెళ్తుంటే అరెస్టులు చేసి నిర్బంధాలకు గురిచేస్తున్నారని తెలిపారు. ఎందుకు ఈ ప్రభుత్వం అంత భయపడుతున్నదని ప్రశ్నించారు. ప్రధాన ప్రతిపక్షంగా తాము పరిగి రైతుల వద్దకు వెళ్తుంటే అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. ప్రజాస్వామ్యం అనే ఏడో గ్యారెంటీ ఇస్తున్నాం.. ప్రజలకు ప్రశ్నించే హక్కు కల్పిస్తం అన్నరు.. ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బలహీనవర్గాల గొంతుకగా మాట్లాడుతుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. తమ మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డిని అరెస్టు చేసి గంటకో పోలీసు స్టేషన్‌కు పంపుతున్నారంటూ మండిపడ్డారు. రైతుల గోస వినడానికి కళ్లాపూర్ దగ్గర మీటింగ్ పెట్టుకున్నామని, ఉదయాన్నే పోలీసులు వెళ్లి టెంట్లు చింపి రైతులను, మహిళలను అరెస్టు చేశారని, అక్కడికొస్తే కేసులు పెడతామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన అన్నారు. ప్రజలకు నిరసన తెలిపే హక్కు లేకుండా చేయడమేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. రేవంతు పరిస్థితి పిచ్చోడు చేతిలో రాయిలా అయిందని, ఎప్పుడు ఎవరి మీద రాయి విసురుతడో తెల్వది.. మూసీ పేరిట అపార్టుమెంట్లు కూల్చుతడు.. హైడ్రా పేరిట పేదల ఇండ్లు కూల్చుతడు.. యూనివర్సిటీ భూములు లాక్కుంటడు.. వ్యవసాయ మార్కెట్ భూములు లాక్కుంటున్నడు.. లగచర్ల లాంటిదే పరిగిలో చేస్తున్నడు అని ఆరోపించారు. దళిత, గిరిజన, బలహీనవర్గాల భూముల మీద రేవంత్ రెడ్డి దండయాత్ర చేస్తున్నడన్నారు. రేవంత్ రెడ్డి వచ్చిన రెండున్నరేండ్లలో పరిశ్రమలు పెడతాం అని నోటిఫికేషన్లు ఇచ్చి 10వేల ఎకరాల దళితుల, ఎస్టీల భూములు లాక్కున్నడు.. ఇంక 40వేల ఎకరాల భూములు లాక్కుంటడట.. ఎందుకు భూముల మీద దండ యాత్ర చేస్తున్నవు అని అడగడానికి వెళ్తున్నం అని అన్నారు. ముఖ్యమంత్రి, స్పీకర్ ఉండి వికారాబాద్ జిల్లాకు శాపం అయ్యిందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీల నోట్లో మట్టికొట్టే ప్రయత్నం చేస్తున్నరంటూ నువ్వు అడ్డుకోవాలని చూసినా మా పోరాటం ఆగదు.. బాజాప్త రైతుల వద్దకు వెళ్తం.. వాళ్ల పోరాటానికి బాసటగా నిలుస్తం అని హరీష్‌రావు స్పష్టం చేశారు. ఎక్కడ అసైన్డ్ భూమి ఉంటే అక్కడ గద్దల్లా వాలుతున్నారన్నారు. తుమ్మల గారు నేను చెప్పిందే చెప్పారు.. అందుకు ధన్యవాదాలు.. కేసీఆర్ ఆలోచనలతో ఫౌండేషన్ వేసింది, నిధులు ఇచ్చింది తాము.. రెడీగా ఉన్న భూములను ఇండస్ట్రీలకు ఇస్తం, పక్కన పంచాయతీలో ఉన్న దిల్ భూములను మార్కెట్ యార్డుకు ఇస్తం అంటడు.. 11 ఏళ్లుగా హైకోర్టులో కేసు క్లియర్ కాలేదని, మీరు రైతు పక్షపాతి అయితే ఇక్కడే టెండర్ పిలిచి అంతర్జాతీయ ప్రమాణాలతో మార్కెట్ నిర్మించండి అని మంత్రికి హరీష్‌రావు విజ్ఞప్తి చేశారు. భూముల వెంట పడకండి.. 22ఏ నిషేధిత జాబితాపై సమీక్షించి తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇండస్ట్రియల్ నోటిఫికేషన్ ఉపసంహరించుకుని పరిగి రైతులకు భూములు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని, అప్పటిదాకా తమ పోరాటం ఆగదని ఆయన హెచ్చరించారు.

# కేరళంలో పంచాయతీరాజ్ విజయం

**(మొదటి పేజీ తరువాయి)**

విజయన్ వైదొలగే సమయం ఆసన్నమైందన్నారు. యూడీఎఫ్ మూడింట రెండొంతుల మెజారిటీతో గెలవబోతున్నదని జోస్యం చెప్పారు. ఊమెన్‌చాందీ తరహా పాలన అందిస్తామన్నారు. కేరళంలో సరైన అవకాశాలు లేకపోవడంతో యువత ఉపాధి కోసం విదేశాలకు వెళ్లారని, దాంతో ఇక్కడ వృద్ధులు చిన్న పిల్లలే కనిపిస్తున్నారంటూ ఇది దురదృష్టకరమని అన్నారు. విద్యావంతులు, నైపుణ్యం ఉన్న యువత విదేశాలకు వెళ్లడం సరికాదన్నారు. వాళ్లు ఇక్కడకు వచ్చి ఉపాధి పొందేలా చేస్తాం, తెలంగాణలో మాదిరే అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ఉద్యోగ నియామకాలు, స్వీయ ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడం వంటివి కేరళంలో అమలు చేస్తాం అని హామీ ఇచ్చారు. విజయన్‌తోపాటు కేరళం కమ్యూనిస్టు మహిళా నాయకులను తాను తెలంగాణకు ఆహ్వానిస్తున్నా.. వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తాం.. ఏ మూలకైనా వెళ్లి తాము అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించవచ్చు అన్నారు. ఈ విషయంలో విజయన్‌కు సవాల్ విసురుతున్నా.. మేం 67 వేల ఉద్యోగాలు ఇచ్చాం.. 25 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ.20,670 కోట్ల రుణ మాఫీ చేశాం.. 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం.. 200 యూనిట్లు లోపు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం.. రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నాం అని చెప్పారు. ఎన్నికలు కేరళం.. తెలంగాణ మధ్య కాదు




యూడీఎఫ్.. ఎల్డీఎఫ్ మధ్య జరుగుతున్నాయి.. మేం ఏం చేస్తున్నామో అది చెబుతున్నాం.. మా సవాళ్లకు విజయన్ సమాధానం ఇవ్వాలి అని రేవంత్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగాఏఎన్ఐతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ విజయన్ తనకు రాసిన లేఖలో 201423 మధ్య విషయాలను ప్రస్తావించారు.. ఆ కాలంలో పినరయి విజయన్ సన్నిహిత మిత్రుడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారని చెప్పారు. ఆయన లేఖలోని తప్పులన్నీ జరిగినందునే తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను మార్చివేశారు.. ఇప్పుడు విజయన్‌ను కేరళం ప్రజలు మార్చివేస్తారు.. విజయన్‌పై శబరిమల బంగారం చోరీ, బంగారం స్మగ్లింగ్ కేసులున్నాయి అని గుర్తు చేశారు. విజయన్ గాడ్‌ఫాదర్ నరేంద్ర మోదీ దిల్లీలో ఉన్నారని, మోదీనే ఈ కేసులన్నింటి నుంచి విజయన్‌ను రక్షిస్తున్నారని విమర్శించారు. దేశం కోసం తమ జీవితాలను, ఆస్తులను త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని రకరకాల కేసులతో వేధిస్తున్నారన్నారు. కేజ్రీవాల్ సహా అనేకమంది నేతలను ఈడీ కేసులతో వేధించి అరెస్టు చేసిన వాళ్లు ఎందుకు విజయన్ జోలికి రావడం లేదని ప్రశ్నించారు. నరేంద్ర మోదీ విజయన్ మధ్య ఉన్న అవగాహనతోనే కేసులు, అరెస్టులు లేవు అని ఎద్దేవా చేశారు. మోదీ.. విజయన్ బంధాన్ని కేరళం ప్రజలు అర్థం చేసుకున్నారు.. సరైన నిర్ణయం తీసుకుంటారు.. కేరళంలో మార్పు వస్తుంది అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# లష్కరే తొయిబా ముఠా అరెస్టు

- **16 ఏళ్లుగా పరారీలో ఉన్న పాక్ ఉగ్రవాదిని పట్టుకున్న పోలీసులు**

**శ్రీనగర్, ఏప్రిల్ 7:**

శ్రీనగర్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న అంతర్రాష్ట్ర లష్కరే తొయిబా ఉగ్ర ముఠాను జమ్ము కశ్మీర్ పోలీసులు ఛేదించారు. ఈ చర్యల్లో ఇద్దరు పాక్ ఉగ్రవాదులతో పాటు ముగ్గురు స్థానికులను అదుపులోకి తీసుకున్నారు. పాకిస్థాన్‌కు చెందిన అబ్దుల్లా అలియాస్ అబు హురైరా అనే ఉగ్రవాది గత 16 ఏళ్లుగా భద్రతా బలగాలకు చిక్కకుండా తిరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. జమ్ము కశ్మీర్ వెలుపల ప్రాంతాలకు కూడా లష్కరే తొయిబా కార్యకలాపాలను విస్తరించడంలో అతడి పాత్ర ఉన్నట్లు వెల్లడించారు. మరో పాక్ ఉగ్రవాది ఉస్మాన్ అలియాస్ కుబైబ్‌ను ఈ నెల 6న అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్‌తో అతడికి సంబంధాలు ఉన్నట్లు విచారణలో తేలినట్లు పేర్కొన్నారు. జమ్ము కశ్మీర్, రాజస్థాన్, హరియాణా రాష్ట్రాల్లోని 19 ప్రాంతాల్లో పోలీసులు ఒకేసారి సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆయుధాలు, నకిలీ గుర్తింపు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఇతర రాష్ట్రాల చిరునామాలతో తయారు చేసిన నకిలీ పత్రాలను ఉపయోగించి నిందితులు దేశవ్యాప్తంగా సంచరిస్తున్నట్లు గుర్తించారు. గత నెల 31న శ్రీనగర్‌కు చెందిన నకీబ్ భట్ అనే వ్యక్తి పోలీసులకు చిక్కడంతో ఈ ఉగ్ర ముఠా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అతడు ఇచ్చిన సమాచారంతో మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిందితులు పాక్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడంతో పాటు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.



# మావోయిస్టు విముక్త తెలంగాణ

**ములుగు, ఏప్రిల్ 7:**

తెలంగాణ రాష్ట్రం మావోయిస్టు విముక్త ప్రాంతంగా మారిందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి కొద్దిమంది మాత్రమే ఉద్యమంలో ఉన్నారని, వారు కూడా బయటకు రావాలని కోరుతున్నామని అన్నారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో ప్రిన్సిపాల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సువర్ణతో కలిసి డీజీపీ పర్యటించారు. కర్రెగుట్టల ప్రాంతంలోని పామునూరు పోలీస్ ఔట్‌పోస్ట్‌కు భూమిపూజ చేసి, ఇంటర్ ఏజెన్సీ కోఆర్డినేషన్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ కర్రెగుట్టల్లో రోడ్లు వేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. కొన్ని కారణాల వల్ల కర్రెగుట్టల ప్రాంతం చాలా కాలంగా అభివృద్ధికి దూరంగా ఉందని, అక్కడి గూడేల్లో నివసిస్తున్న ప్రజలకు కనీస సౌకర్యాలు అందలేదని తెలిపారు. ప్రస్తుతం రోడ్ల నిర్మాణంతో అభివృద్ధి కార్యక్రమాలకు మార్గం సుగమమవుతోందని పేర్కొన్నారు. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే రోడ్లు అత్యంత కీలకమని అన్నారు. కర్రెగుట్టల ప్రాంతాన్ని మిగతా ప్రపంచంతో అనుసంధానం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు.



ఇప్పటి వరకు 13 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం పూర్తయిందని వివరించారు. మున్ముందు ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.పామునూరు గ్రామస్థులకు బియ్యం, నిత్యావసర వస్తువులు, సోలార్ లాంతర్లను డీజీపీ పంపిణీ చేశారు. అటవీ చట్టాలను ఉల్లంఘించకుండా కర్రెగుట్టల్లో రోడ్లు నిర్మిస్తున్నామని ప్రిన్సిపాల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సువర్ణ తెలిపారు. ఈ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇక రోడ్డు భద్రతపై కూడా డీజీపీ అవగాహన కల్పించారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో పాల్గొని, అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్ల ప్రాణనష్టం జరుగుతుందని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.



# యూరియాను శాస్త్రీయంగా వాడాలి

**హైదరాబాద్, ఏప్రిల్ 7:**
దేశంలో అధికంగా యూరియా వాడుతున్న రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఉందని, ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఆయన సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి మాట్లాడారు. యూరియాను అధికంగా వాడటం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు రానురాను దిగుబడులు కూడా తగ్గుతాయని, చీడపీడల సమస్యలు పెరుగుతాయని తెలిపారు. అందువల్ల యూరియాను శాస్త్రీయంగా వాడాలని సూచించారు. యూరియా యాప్, యూరియా వినియోగం వంటి అంశాలపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. 'రైతు నేస్తం'లో రైతులు అధికంగా పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల సందేహాలను నివృత్తి చేయడంతోపాటు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. యూరియా యాప్‌పై రైతుల అభిప్రాయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. యూరియా యాప్‌తో లైన్లలో నిలబడే బాధ తప్పిందని, ఇంట్లో నుంచే యూరియాను బుక్ చేసుకుని తగిన సమయంలో తెచ్చుకునేందుకు వీలు కలిగిందని, దీంతో సమయం వృథా కావడంలేదని రైతులు యూరియా యాప్‌ని కొనియాడారు. భవిష్యత్తులో కూడా యూరియా యాప్‌తోనే యూరియా అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని రైతుల అభిప్రాయాల మేరకే ఈ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పుడు పంట కోతల సమయం వచ్చిందని, రైతులు కోతల అనంతరం వచ్చే పంట వ్యర్థాలను కాల్చవద్దని సూచించారు. పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. రైతులు తాము పండించే అన్ని పంటలలో పామాయిల్ పంటను కూడా వేయవచ్చని వివరించారు. రైతులందరు పామాయిల్ పంటను వేసినట్లయితే స్థిరమైన అధిక ఆదాయం పొందే వీలుంటుందన్నారు.

***మంత్రిని కలిసిన హుజురాబాద్ మున్సిపల్ పాలకవర్గం**

సచివాలయంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ప్రతిపాదించిన డంపింగ్ యార్డు పనులను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీహుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆడిట్ శాఖ దేశంలోనే నెంబర్ వన్



**హైదరాబాద్, ఏప్రిల్ 7:**
ఆన్‌లైన్ ఆడిటింగ్‌లో అత్యుత్తమ ప్రమాణాలతో తెలంగాణ ఆడిట్ శాఖ దేశంలో నెంబర్ వన్‌గా నిలిచిందని, వరుసగా మూడుసార్లు దేశంలో నెంబర్ వన్ ర్యాంకు సాధించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్రంలో ఆన్‌లైన్ ఆడిటింగ్ వ్యవస్థను పరిశీలించేందుకు వచ్చిన గుజరాత్ ఆడిట్ శాఖ ఉన్నతాధికారులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. గుజరాత్ నుంచి ప్రత్యేకంగా వచ్చిన ఉన్నతాధికారులందరికీ సాదరంగా స్వాగతం పలుకుతున్నానన్నారు. తమ రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు అత్యంత బలంగా ఉన్నాయని అధికారులకు వివరించారు. రాష్ట్రంలో ఆడిట్ శాఖ పనితీరు అధ్యయనానికి అవసరమైన పూర్తి సహాయసహకారాలను అందిస్తామని, రాష్ట్రంలో జరుగుతున్న విషయాలను అర్థం చేసుకోవడానికి తమ అధికారులు పూర్తిగా సహకరిస్తారని గుజరాత్ అధికారులతో డిప్యూటీ సీఎం తెలిపారు. రెండు రోజులుగా రాష్ట్రంలోని పలు గ్రామ పంచాయతీలను సందర్శించి ఆన్‌లైన్ వ్యవస్థను అధ్యయనం చేస్తున్నామని, రాష్ట్రంలో ఆడిటింగ్ వ్యవస్థ పారదర్శకంగా, సమర్థవంతంగా కొనసాగుతున్నదని గుజరాత్ అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, తెలంగాణ ఆడిట్ శాఖ డైరెక్టర్ నరసింహన్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు వారాల్లో పరిష్కరిస్తాం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 07:**
దేశవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో సీసీటీవీల ఏర్పాటు, నిర్వహణకు సంబంధించిన సమస్యలను రెండు వారాల్లో పరిష్కరిస్తామని కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు హామీ ఇచ్చింది. ఈ అంశంపై సమగ్ర సమీక్ష కొనసాగుతోందని కేంద్రం తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి ధర్మాసనానికి తెలిపారు. సీసీటీవీల పనితీరుపై ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి అమికస్ క్యూరీ, కేంద్ర హోం కార్యదర్శితో వరుస సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పలు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. దేశవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో పనిచేయని సీసీటీవీల అంశంపై దాఖలైన పలు పిటిషన్లతో పాటు సుమోటోగా స్వీకరించిన కేసుపై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర హోం కార్యదర్శి కూడా విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం ఈ కేసును సుప్రీం కోర్టు ఏప్రిల్ 28కు వాయిదా వేసింది.



తదుపరి విచారణకు ముందు అమికస్ క్యూరీ తాజా స్థితిగతుల నివేదిక సమర్పించాలని, అవసరమైతే కేంద్ర ప్రభుత్వం కూడా అఫిడవిట్ దాఖలు చేయవచ్చని ధర్మాసనం సూచించింది. ప్రత్యేక పరిస్థితులు లేకపోతే భవిష్యత్తులో హోం కార్యదర్శి వ్యక్తిగతంగా హాజరుకావాల్సిన అవసరం లేదని ధర్మాసనం పేర్కొంది.

# ప్రజారోగ్యమే సమాజానికి బలమైన పునాది

**హైదరాబాద్, ఏప్రిల్ 7:**
ఆరోగ్యం కోసం ఐక్యంగా.. విజ్ఞాన శాస్త్రానికి మద్దతుగా అనే థీమ్‌తో ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, ఇది ఆరోగ్య రంగంలో శాస్త్ర సహకారం, ఆధారిత నిర్ణయాల ప్రాముఖ్యతను గుర్తు చేస్తోందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. వరల్డ్ హెల్త్ డే సందర్భంగా రవీంద్ర భారతిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఆరోగ్యం అంటే వ్యాధులు లేకపోవడ□మే కాదు.. శారీరక, మానసిక, సామాజికంగా ఆరోగ్యంగా ఉండడం కూడా అవసరమని, ప్రజారోగ్యమే అభివృద్ధి చెందిన సమాజానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, సపోర్టింగ్ స్టాఫ్ సేవల వల్లే ప్రజల ఆరోగ్యం రక్షితంగా ఉందంటూ కోవిడ్ వంటి క్లిష్ట పరిస్థితుల్లో సేవలందించిన వైద్య సిబ్బందికి మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రాథమికస్థాయి నుంచి సూపర్ స్పెషాలిటీస్థాయి వరకు ఆరోగ్య సేవలను బలోపేతం చేస్తున్నామని, మౌలిక వసతులు, మానవ వనరులు, ఔషధాలు, డయాగ్నోస్టిక్ సేవలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. జీవన శైలిలో వచ్చిన మార్పులు, ఆహారపు అలవాట్లు, కాలుష్యం తదితర కారణాలతో డయాబెటిస్, బీపీ, గుండె, మూత్రపిండాలు, క్యాన్సర్ వంటి నాన్ కమ్యునికబుల్ వ్యాధులు పెరుగుతున్నాయన్నారు. ఇవి ప్రజలపై ఆర్థిక భారం పెంచుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాధులను ఎదుర్కొనేందుకు ప్రివెంటివ్, ప్రమోటివ్, క్యూరేటివ్, రిహాబిలిటేటివ్ విధానంతో సమగ్ర ఆరోగ్య సేవలనందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌సీడీ క్లినిక్స్, డే కేర్ క్యాన్సర్ సెంటర్లు, పాలియేటివ్, జెరియాట్రిక్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. కొత్తగా 79 డయాలిసిస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, 109 ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేసి అత్యవసర సేవలను బలోపేతం చేస్తున్నామని, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడేందుకు ప్రతి 35 కి.మీ కు ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, రూ.1100 కోట్లతో నాలుగు స్థాయిల ట్రామా కేర్ వ్యవస్థను అమలు చేయబోతున్నామని వివరించారు. అంబులెన్స్ సేవలను బలోపేతం చేస్తూ 213 కొత్త వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చామని, త్వరలో మరిన్ని అంబులెన్సులను అందుబాటులోకి తీసుకొస్తామని, 10 నిమిషాల లోపు ఘటనా స్థలానికి అంబులెన్స్ చేరుకునే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఈరోజు క్యాన్సర్‌ను నోటిఫైబుల్ వ్యాధిగా ప్రకటిస్తున్నామన్నారు. క్యాన్సర్ రిజిస్ట్రీ ద్వారా ఖచ్చితమైన డేటాతో మెరుగైన ప్రణాళికలు రూపొందిస్తామని, ప్రతి జిల్లాలో డే కేర్ క్యాన్సర్ సెంటర్ల ద్వారా చికిత్సను ప్రజలకు చేరువ చేశామని, ములుగు, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో కూడా కీమోథెరపీ సేవలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో పాలియేటివ్ కేర్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈరోజు నిమ్స్‌లో అత్యాధునిక లినాక్ సేవలను ప్రారంభించామని, రాష్ట్రంలో రీజినల్ క్యాన్సర్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేసే దిశగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా క్యాన్సర్ వంటి వ్యాధులను ముందdుగా గుర్తించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆస్ట్రాజెనెకాతో కలిసి 20 ప్రభుత్వ హాస్పిటళ్లలో లంగ్ క్యాన్సర్ ముందస్తు నిర్ధారణపై పైలట్ ప్రాజెక్టును త్వరలో ప్రారంభిస్తున్నామని, ఇందుకోసం ఆస్ట్రాజెనెకాతో ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. ప్రతి పౌరుడికీ□ హెల్త్ ప్రొఫైల్ రూపొందించే దిశగా చర్యలు ప్రారంభించామని, 46 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్టు పోర్టల్‌ను ప్రారంభించామని, పీసీపీఎన్‌డీటీ, ఏఆర్‌టీ, సరోగసీ చట్టాల అమలుకు ప్రత్యేక పోర్టల్స్ తీసుకొచ్చామని, పారదర్శకత, నాణ్యత, బాధ్యతాయుత వ్యవస్థను తయారు చేస్తున్నామని చెప్పారు. ఆరోగ్యశ్రీ సేవలను విస్తరిస్తూ ప్రజల ఆర్థిక భారం తగ్గిస్తున్నామన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల కోసం కొత్త ఆరోగ్య పథకాన్ని తీసుకొస్తున్నామని, జిల్లా స్థాయిలోనే 80% వైద్య అవసరాలు తీర్చే లక్ష్యంతో సెకండరీ హెల్త్‌కేర్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. టిమ్స్ హాస్పిటల్స్, వరంగల్ హెల్త్ సిటీ, కొత్త ఉస్మానియా హాస్పిటల్ నిర్మాణం చేపడుతున్నామని, నిమ్స్‌లో 2000 పడకల కొత్త భవనం నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఆరోగ్య శాఖలో రెండేళ్లల్లో 10 వేల పోస్టులు భర్తీ చేశామని, ఇంకా 7 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. క్యాన్సర్, ఇతర వ్యాధులపై పోరాటం కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు.. ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం అన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం అని మంత్రి దామోదర పిలుపునిచ్చారు. కాగా, విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందికి మంత్రి అవార్డులు అందజేశారు.



**అందుబాటులోకి కచ్చితమైన రేడియేషన్ చికిత్స**

నిమ్స్‌లో అత్యాధునిక లినాక్(లీనియర్ యాక్సలరేటర్) సేవలను ప్రారంభించడంతో కేన్సర్ రోగులకు ఖచ్చితమైన రేడియేషన్ చికిత్స అందుబాటులోకి వచ్చిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. రూ.33 కోట్లతో నిమ్స్ కేన్సర్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన ఈ సేవలను ఆయన మంగళవారం ప్రారంభించారు. సేవల ప్రారంభంతో తెలంగాణలో క్యాన్సర్ చికిత్స మరింత బలోపేతం అవుతుందన్నారు. అనంతరం మహిళల కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపును మంత్రి ప్రారంభించారు. ఈ ఆధునిక సాంకేతికతతో ట్యూమర్‌పై మాత్రమే ప్రభావం చూపించి, ఆరోగ్య కణజాలాన్ని కాపాడే చికిత్స అందించగలుగుతామన్నారు. ట్రూ బీమ్ సిస్టమ్‌తో తక్కువ సమయంలోనే మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం కల్పించామని, కేన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఆధునిక వైద్య సదుపాయాలను మరింత విస్తరిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో యేటా 55 వేల నుంచి 60 వేల కొత్త కేసులు నమోదవుతుండడం ఆందోళన కలిగించే విషయమన్నారు. కేన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని ప్రజల్లో అవగాహన పెంచుతున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా కేన్సర్ చికిత్స అందుబాటులోకి తీసుకొచ్చే దిశగా చర్యలు చేపట్టామని, అన్ని జిల్లా కేంద్రాల్లో డే కేర్ క్యాన్సర్ కేంద్రాలను ఏర్పాటు చేసి సేవలను విస్తరిస్తున్నామని, ములుగు, ఆదిలాబాద్ వంటి మారుమూల ప్రాంతాల్లో కూడా కీమోథెరపీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. 46 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ద్వారా ముందస్తు వ్యాధి నిర్ధారణకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈరోజు నుంచి నిమ్స్‌లో మహిళల కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపును ప్రారంభించామని, మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని చెప్పారు. 14నుంచి 15 ఏళ్ల బాలికలకు ఉచితంగా టీకా అందిస్తూ గర్భాశయ కేన్సర్ నివారణకు కృషి చేస్తున్నామన్నారు. ఈరోజు కేన్సర్‌ను నోటిఫైబుల్ వ్యాధిగా ప్రకటిస్తున్నామని, తద్వారా ప్రతి కేన్సర్ కేసును నమోదు చేసే విధానం తీసుకొస్తున్నామని, కేన్సర్ రిజిస్ట్రీ ద్వారా ఖచ్చితమైన డేటాతో మెరుగైన ప్రణాళికలు రూపొందించగలుగుతామని చెప్పారు. కేన్సర్‌పై పోరాటం కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు, ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని మంత్రి దామోదర్ అన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ , ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయడమే కాంగ్రెస్ సంకల్పం

**మహబూబ్ నగర్, ఏప్రిల్ 07:**
మహబూబ్ నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయడమే కాంగ్రెస్ సంకల్పమని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం రోజునమహబూబ్ నగర్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' కార్యక్రమం భాగంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యవర్గ ప్రమాణ స్వీకారం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ డీసీసీ కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, సీడబ్ల్యూసీ సభ్యులు చల్లా వంశీ చందర్ రెడ్డి , టిపిసిసి జనరల్ సెక్రటరీలు ,తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మాట్లాడారు . పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి అయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందించి రైతుల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడం లక్ష్యం అని ఆయన అన్నారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేస్తోంద. ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వకుండా నిర్లక్ష్యం చూపుతోందన్నారు.కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తె పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కు జాతీయ హోదా ఇస్తామన్నారు.పదేళ్ల బిఆర్ ఎస్ ఆర్థిక విధ్వంసాన్ని ఎత్తి చూపి తీరాల్సిందేన్నారు.
విజన్ లేకుండా బిఆర్ఎస్ పాలన కొనసాగిందన్నారు.సుదీర్ఘ చరిత్ర కలిగిన పార్టీ కాంగ్రెస్, మహత్యాగాలు చేసిన కుటుంబం గాంధీ కుటుంబం అని చెప్పారు. మోదీ 12 ఏళ్ల కాలంలో అధికారం పరమావధిగా కుల మతాల మధ్య చిచ్చు పెడుతూ విచ్చిన్నం చేసే కుట్రలు చేసిందన్నారు.

**బీజేపీ హయంలో పెట్రోల్,డీజిల్ రెట్లు తగ్గాయా?**

2 కోట్ల ఉద్యోగాలు వచ్చాయా?శ్రీరాముడి పేరు చెప్పి ఓట్లు అడగడం బీజేపీ నేతల నైజం అని ఘాటుగా విమర్శించారు.పిల్లల భవిష్యత్ కోసం కాంగ్రెస్ పార్టీ కావాలన్నారు.రాజకీయం చైతన్యం కలిగిన జిల్లా మహబూబ్ నగర్ అని ,ప్రతి ఒక్క కార్యకర్త కాంగ్రెస్ ప్రభుత్వ. అభివృద్ధి, సంక్షేమన్ని ప్రజలకు వివరించే ప్రయత్నం చేయాలన్నారు.కేటీఆర్ ,హరీష్ రావు నిత్యం అసత్యాలు, అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారనీ మండిపడ్డారు. కష్టపడితే ఫలితం వస్తుంది అన డానికి నేను పిసిసి కావడం ఓ ఉదాహరణఅని కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి లక్ష 20 వేల కోట్లు గోదావరిలో పోశారనీ ఘాటుగావిమర్శించారు. కాంట్రాక్టుల జేబులు నింపడం కోసం ప్రాజెక్టులు కట్టారని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఈ సందర్భంగా ఘాటుగా విమర్శలు చేశారు.

## కల్లియాస్సేరి నియోజకవర్గంలో

# భారీ రోడ్ షో

**కేరళం, ఏప్రిల్ 07:**
కల్లియాస్సేరి నియోజకవర్గంలో సోమవారం రోజున భారీ మరియు ఉత్సాహభరితమైన రోడ్ షో నిర్వహించబడింది. ఈ రోడ్ షోలో ప్రజల నుంచి లభించిన అపార స్పందన యునైటెడ్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్)కు పెరుగుతున్న మద్దతును స్పష్టంగా తెలియజేస్తోంది.ఈ కార్యక్రమంలో ఏఐసీసీ పరిశీలకులు హర్కర వేణుగోపాల్ రావు, కాసరగోడ్ లోక్‌సభ సభ్యులు రాజ్‌మోహన్ ఉన్నితాన్, కల్లియాస్సేరి అసెంబ్లీ యూడీఎఫ్ అభ్యర్థి రాజీవన్ కప్పచేరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా హర్కర వేణుగోపాల్ రావు మాట్లాడుతూ, ప్రజల నుంచి లభిస్తున్న విశేష స్పందన యూడీఎఫ్ విజయానికి సంకేతమని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏకమై కృషి చేస్తుండటం వల్ల ఈ నియోజకవర్గంలో ఘన విజయం సాధిస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# సమాచార సమగ్రత పరిరక్షకులు ఐఐఎస్ అధికారులు

- **బలాన్ని కాకుండా మేథస్సుతో చేసే సమాచార యుద్ధంలో అగ్రభాగాన నిలవండి**
- **కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అట్టడుగువారికి చేరేలా సమాచార వ్యాప్తి చేయండి**
- **ఐఐఎస్ ట్రైనీ అధికారులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచన**
- **2009, 2023, 2024 ఐఐఎస్ ట్రైనీ అధికారులతో కేంద్ర మంత్రి భేటీ**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 07:**
దేశ భద్రత, సంక్షోభ సమయాల్లో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ గందరగోళం సృష్టించే శక్తులను కుట్రలను తిప్పికొట్టేందుకు సమయోచిత, వాస్తవిక, బాధ్యతాయుతమైన సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఐఎస్) అధికారుల పాత్ర చాలా కీలకమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఐఐఎస్ అధికారులు సమాచార మాధ్యమకారులుగా మాత్రమే కాదని, సమాచార సమగ్రతకు(ఇన్ఫర్మేషన్ ఇంటెగ్రిటీ), జాతీయ ఐక్యత పరిరక్షకులుగా నిలవాలని సూచించారు. యుద్ధం చేయకుండా సమాచార వ్యాప్తి ద్వారా శత్రువులను మనసులను ప్రభావితం చేయడంలో టీవీ, రేడియో సహా మీడియా సైకలాజికల్ ఆపరేషన్స్ నిర్వహిస్తూ ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. బలాన్ని కాకుండా మేథస్సును ఉపయోగించి చేసే సమాచార యుద్ధంలో ఐఐఎస్ అధికారులు అగ్రభాగాన నిలవాలని కోరారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఐఎస్) 2009,



2023, 2024 బ్యాచ్ లకు చెందిన గ్రూప్ ఏ ట్రైనీ అధికారులు ఈనెల 15 నుండి 22 వరకు అంతర్గత భద్రత, సంక్షోభ, విపత్తు కమ్యూనికేషన్, సైకలాజికల్ ఆపరేషన్స్ పై అవగాహన పెంపొందించుకునేందుకు ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రోజున సాయంత్రం న్యూఢిల్లీలోని కర్తవ్య భవన్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ను ఆయా ట్రైనీ అధికారులు మర్యాదపూర్వంగా కలిశారు.
ఈ సందర్భంగా ఆయా అధికారుల విద్య, కుటుంబ నేపథ్య వివరాలను అడిగి తెలుసుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ లోకి రావడానికి కారణాలపైనా ఆరా తీశారు. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో క్షేత్రస్థాయిలోకి వెళుతున్నాయా? లేదా? అట్టడుగునున్న అణగారిని వ్యక్తుల వరకు సంపూర్ణంగా సంక్షేమ ఫలాలు అందాలంటే ఏం చేస్తే బాగుంటుందనే అంశాల పైనా ఆరా తీశారు. ముఖ్యంగా నేటి పరిస్థితుల్లో సేవలు ఎలా మారుతున్నాయి? భవిష్యత్తులో ఎలా మారబోతున్నాయనే అంశాలతోపాటు మారుమూల గ్రామాలకు సైతం సమాచారం చేరేలా కమ్యూనికేషన్ బలపడేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపైనా వారితో చర్చించారు.
అనంతరం వారిని ఉద్దేశించి బండి సంజయ్ మాట్లాడుతూ... వేగంగా మారుతున్న సమాచార ప్రపంచంలో సమర్ధవంతమైన కమ్యూనికేషన్ కేవలం పరిపాలనా సాధనం మాత్రమే కాదని, జాతీయ స్థిరత్వానికి, ప్రజల విశ్వాసానికి మూల స్థంభమని చెప్పారు. ఈ విషయంలో ఐఐఎస్ అధికారుల పాత్ర కీలకమని తెలిపారు. ముఖ్యంగా అంతర్గత భద్రతకు సంబంధించిన విషయానికొస్తే... మీడియా, సోషల్ మీడియాలో ప్రజలను తప్పుదారి పట్టించే ఫేక్ సమాచారం సవాల్ విసురుతున్న నేటి తరుణంలో వాటిని అధిగమిస్తూ ప్రజలను చైతన్యం చేసేందుకు ఏం చేయాలనే దానిపై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్స్, సెంట్రల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అందించే ప్రత్యేక శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య మధ్యవర్తిగా పనిచేసేలా సిద్ధం కావాలని సూచించారు. "దేశం మీమీద ఆశలు పెట్టుకుంది. మీరు కేవలం సమాచార మాధ్యమకారులుగా మాత్రమే కాదు. సమాచార సమగ్రతకు(ఇన్ఫర్మేషన్ ఇంటెగ్రిటీ), జాతీయ ఐక్యత పరిరక్షకులుగా నిలవాలి"అని సూచించారు. "యుద్ధం చేయకుండా సమాచార వ్యాప్తి ద్వారా శత్రువులను మనసులను ప్రభావితం చేయడంలో టీవీ, రేడియో సహా మీడియా ముఖ్యపాత్ర పోషిస్తాయి. ఈ విషయంలో బలాన్ని కాకుండా మేధస్సును ఉపయోగించి చేసే సమాచార యుద్ధంలో అగ్రభాగా నిలవాలి"అని కోరారు. ముఖ్యంగా దేశ భద్రత, సంక్షోభ సమయాల్లో తప్పుడు సమాచారాన్ని పంపుతూ గందరగోళం సృష్టించే శక్తులను కుట్రలను తిప్పికొట్టేందుకు సమయోచిత, వాస్తవిక, బాధ్యతాయుతమైన సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఐఐఎస్ అధికారుల పాత్ర చాలా కీలకమని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి అంద్ర వంశీ, కేంద్ర హోంశాఖ మీడియా విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ రాజ్ కుమార్, ఐఐఎస్ విభాగం కోర్సు డైరెక్టర్ రష్మీ రోజా తుషార నాయర్ తదితరులు పాల్గొన్నారు.




సంపాదకీయం

# అభివృద్ధికి 'రాజకీయ' గ్రహణం

## తెలుగు రాష్ట్రాల్లో సాగుతున్న వింత పోకడలు

రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలి. కానీ, అధికార పీఠం కోసం రాష్ట్ర ప్రయోజనాలను, అభివృద్ధి ప్రాజెక్టులను పణంగా పెట్టడం పాలకులకు పరిపాటిగా మారింది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన నుంచి ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి నిర్మాణం వరకు.. అన్నీ రాజకీయ చదరంగంలో పావులుగా మారుతుండటం ఆందోళనకరం. రాజకీయాలు వేరు.. అభివృద్ధి వేరు. ఈ రెండింటినీ వేర్వేరు ధ్రువాలుగా చూడనంత కాలం వ్యవస్థలో మార్పు రాదు. ఈ రెండింటిని కలగలిపి చూడటం వల్లనే అభివృద్ధి కుంటుపడుతుంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అభివృద్ధి పథంలో దూసుకుపోవాల్సిన రాష్ట్రాలు, రాజకీయ కక్షలు మరియు సంకుచిత ప్రయోజనాల వల్ల వెనక్కి నెట్టబడుతున్నాయి.

### మూసీ ప్రక్షాళన: పట్టుదల - ప్రతిఘటన

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు తలమానికంగా ఉండాల్సిన మూసీ నది నేడు మురుగు కూపంగా మారింది. దీనిని ప్రక్షాళన చేసి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలతో ఉన్నారు. ఇది ఆహ్వానించదగ్గ పరిణామమే. అయితే, ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన అంశం 'నిర్వాసితుల సంక్షేమం'. ఇల్లు కోల్పోయిన వారికి ఇల్లు, స్థలం కోల్పోయిన వారికి స్థలం ఇచ్చి, వారు ఆనందపడేలా ఉత్తమ ప్యాకేజీని అమలు చేయాలి. ప్రభుత్వం చూపిన నమూనా ప్రకారం ముందుకు వెళ్లడం మంచిదే, కానీ క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను గౌరవించాలి. మరోవైపు, నగర మురుగునీటిని మళ్ళించే ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ఇంతకాలం హైదరాబాద్ మురుగునంతా మూసీలోనే పారబోశారు, దానికి శాశ్వత పరిష్కారం చూపకుండా కేవలం సౌందర్యీకరణ చేస్తే ఫలితం ఉండదు. అయితే, ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న బిఆర్ఎస్, బిజెపిలు కేవలం రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నాయి తప్ప, 'ఇలా చేస్తే బాగుంటుంది' అని ఎందుకు సలహాలు ఇవ్వడం లేదు? పదేళ్ల పాలనలో తెలంగాణను అప్పుల పాలు చేశారనే విమర్శలు ఎదుర్కొంటున్న పాత పాలకులు, ఇప్పుడైనా నిర్మాణాత్మక పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. అభివృద్ధిని రాజకీయంతో ముడిపెట్టడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలే దెబ్బతింటాయి.

### అమరావతి: అయోమయ రాజకీయం

ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి పరిస్థితి మరీ దారుణం. ఒక రాష్ట్రానికి రాజధాని అనేది కేవలం కార్యాలయాల సముదాయం కాదు, అది ఆ రాష్ట్ర గౌరవం మరియు ఆదాయ వనరు. 2019లో భారీ మెజారిటీతో 151 సీట్లు కట్టబెట్టిన ప్రజలకు జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన బహుమతి ఏంటి? ఐదేళ్ల పాటు 'మూడు రాజధానుల' పేరుతో కాలయాపన చేయడం, అభివృద్ధిని పడకేయించడం. అప్పుడు రాని 'మావిగన్' ఆలోచనలు ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రావడం చూస్తుంటే, అది కేవలం అమరావతిపై ఉన్న ద్వేషమే తప్ప రాష్ట్రంపై ఉన్న ప్రేమ కాదని స్పష్టమవుతోంది. రాజ్యాంగంలో రాజధాని అనే పదం లేదని చెప్పడం ద్వారా ఆయన తన రాజకీయ అజ్ఞానాన్ని లేదా అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారు. ప్రజలు చైతన్యం వచ్చి గత ఎన్నికల్లో తగిన తీర్పు ఇచ్చారు. ఇప్పటికైనా వైఫల్యాల నుండి పాఠాలు నేర్చుకోకపోవడం ఆ పార్టీ నేతల దౌర్భాగ్యం. కేవలం అధికార దాహం తప్ప అభివృద్ధిపై వారికి అవగాహన లేదని వారి మాటలే స్పష్టం చేస్తున్నాయి.


### పాలకులు మేల్కోవాలి - ఆరోపణలు వీడాలి

ప్రస్తుత పాలకులు కూడా గతాన్ని గుర్తుంచుకోవాలి. కేవలం రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత బస్సు ప్రయాణాలు మాత్రమే అభివృద్ధి అని భ్రమపడకూడదు. ఇవి తాత్కాలిక ఊరటనిచ్చే సంక్షేమ పథకాలు మాత్రమే. శాశ్వత అభివృద్ధి అంటే మౌలిక వసతుల కల్పన, పారదర్శక పాలన. ముఖ్యంగా, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడిపై వస్తున్న భూకబ్జా ఆరోపణల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మౌనం వీడాలి. ఈ ఆరోపణలను వెంటనే ఖండించడమో లేదా విచారణ జరిపించడమో చేయకపోతే, ప్రజల్లో అనుమానాలు బలపడతాయి. నిర్మాణాత్మక పనులు మొదలుపెట్టకుండా కేవలం ప్రచారానికే పరిమితమైతే, రేవంత్ రెడ్డి కూడా రాజకీయ మూసీలో కొట్టుకుపోవడం ఖాయం. రేవంత్ రెడ్డి 'ఫ్యూచర్ సిటీ' అంటున్నారు, కానీ నగరాలు వాటంతట అవే రావాలి తప్ప ఫోర్స్ చేస్తే రావు. అభివృద్ధి అనేది ఒక సహజ ప్రక్రియ అని గుర్తించాలి.

**హైదరాబాద్ నగరం ఈ స్థాయికి చేరడానికి మూడు దశాబ్దాల నిరంతర కృషి ఉంది. అభివృద్ధి అనేది ఆగిపోయే ప్రక్రియ కాదు. ఆంధ్రప్రదేశ్‌కు విశాఖ నుంచి ఆదాయం వస్తున్నా, అమరావతి అభివృద్ధి చెందితేనే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకుంటుంది. రైతులు ఇచ్చిన భూములను అభివృద్ధి చేసి, వాటి ద్వారా వచ్చే ఆదాయంతో మౌలిక వసతులు కల్పించడం సరైన మార్గం. పాలకులకు వందేళ్ల ముందుచూపు ఉండాలి. సంకుచిత ఆలోచనలు పక్కన పెట్టి, అభివృద్ధికి బాటలు వేసినప్పుడే రాష్ట్రాల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. భజనపరుల మాటలు నమ్మి వాస్తవాలను విస్మరిస్తే పతనం తప్పదని గత పాలకులు ఇప్పటికే నిరూపించారు.**

# బెంగాల్‌పై కన్నేస్తే.. పాక్ ముక్కలే

- పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్యలకు కౌంటర్
- రెచ్చగొట్టే ప్రకటనలపై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్పడ్డారు. కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటుగా స్పందించారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను ఆయన చేయకుండా ఉండాల్సిందని, బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో భగవంతుడికే తెలియాలని అన్నారు. ఈ వ్యాఖ్యల పైనే తాజాగా రాజ్‌నాథ్ ఘాటుగా స్పందించారు. ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లనే 55 ఏళ్ల క్రితం పాక్ రెండుగా విడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది. నాడు బంగ్లా విముక్తి పోరాటానికి భారత సైన్యం అండగా నిలిచింది. ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌ను ఆయన హెచ్చరించారు. వారు బెంగాల్‌పై కన్నేస్తే.. ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలి అని వ్యాఖ్యానించారు. భారత్ భవిష్యత్తులో ఎలాంటి దుస్సాహసాలకు పాల్పడినా కోల్‌కతాపై దాడి చేస్తామని ఖవాజా ఆసిఫ్ గత శనివారంనాడు నోరుపారేసుకున్నారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్ర మమతా బెనర్జీ, ఎంపీ అభిషేక్ బెనర్జీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలకు దిగింది. కోల్‌కతాపై దాడి చేస్తామని బహిరంగంగా బెదిరించినా ఖవాజా ఆసిఫ్ ప్రకటలను ఖండించే ధైర్యం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు లేకుండా పోయిందని అభిషేక్ బెనర్జీ విమర్శించారు. ఒక ఔన్సు ధైర్యం ఉన్నా కేంద్ర బలగాలకు, బీఎస్ఎఫ్, ఇండియన్ ఆర్మీకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి పట్టుకునేందుకు స్వేచ్ఛనివ్వాలని అన్నారు. మోదీ, అమిత్, రాజ్‌నాథ్ సింగ్‌కు ఆ సాహసం ఉందా? అని ప్రశ్నించారు. మమతా బెనర్జీ సైతం కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. భారత్ స్పందన తీవ్రంగా ఉంటుందని ఆయన ఎందుకు హెచ్చరించలేకపోతున్నారు? అని నిలదీశారు. ప్రధాని రాజీనామాకు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ తాజాగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# శబరిమలలో మహిళల ప్రవేశంపై నిషేధం

- 9మంది జడ్జిల సుప్రీం విస్తృత ధర్మాసనం విచారణ
- ప్రాచీన ఆచారాలు కేవలం మత విశ్వాసాలకు సంబంధించినవే
- ఇందులో మహిళల పట్ల వివక్ష లేదని కేంద్రం వాదన



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** ప్రాచీనకాలం నుంచి కొనసాగుతోన్న సంప్రదాయాలకు అనుగుణంగానే శబరిమల ఆలయంలో మహిళకు ప్రవేశ నిషేధం విధించారు కానీ.. దీనికి సంబంధించి వివక్ష ఏమీ లేదని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. మహిళల ప్రవేశాన్ని అనుమతించడమనేది ఆరాధనా స్వరూపాన్నే మార్చివేస్తుంది. ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా శతాబ్దాలుగా భక్తులు స్వామిని పూజిస్తున్నారని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వెల్లడించారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి గతంలో వెలువడిన తీర్పును మంగళవారం జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది జడ్జీల ధర్మాసనం సమీక్షిస్తోంది. ఈమేరకు పిటిషన్‌దారుల వాదనలు వింటోంది. దీనికి ముందు కేంద్రం తన వివరణను సమర్పించింది. ఈ అంశం పూర్తిగా మత విశ్వాసాలకు సంబంధించినదని పేర్కొన్నారు. న్యాయసమీక్షకు అతీతమైందని వాదించారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి ఉన్న ఆంక్షలు కొనసాగించాలని సుప్రీంకోర్టును కోరారు. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 10-50 ఏళ్ల వయసున్న మహిళల ప్రవేశంపై నిషేధాన్ని రద్దు చేస్తూ 2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అయితే ఈ తీర్పుపై పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే 9 మంది సభ్యుల విస్తృత ధర్మాసనం ఈ కేసును విచారిస్తోంది. శబరిమల ఆలయంలో మహిళల ఎంట్రీ అంశంపై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నది. 9 మంది సభ్యుల ధర్మాసనం విభిన్న కోణాల్లో ఈ అంశాన్ని విచారిస్తున్నది. సుప్రీం ధర్మాసనంలో సీజేఐ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ బీవీ నాగరత్న, ఎంఎం సుందరేశ్, అషానుద్దిన్ అమానుల్లా, అరవింద్ కుమార్, ఆగస్టిన్ జార్జ్ మాసి, ప్రసన్న బి వర్లే, ఆర్ మహాదేవన్, జోయ్‌మాల్యా బాగ్చీ ఉన్నారు. 10 నుంచి 50 ఏళ్ల వయసున్న మహిళలకు శబరిమల ఆలయంలోకి ప్రవేశం లేదన్న అంశంతో పాటు మరికొన్ని అంశాలను సుప్రీంకోర్టు పరిశీలిస్తున్నది. అయితే సుప్రీం ధర్మాసనం ముందు కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేసింది. కేరళలోని శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం విషయంలో ఉన్న నిబంధనలను కేంద్ర ప్రభుత్వ సమర్థించింది. అయితే ఆ అంశం మత విశ్వాసాలకు చెందుతుందని, మతం పరిధిలోకి వస్తుందని, జుడిషియల్ పరిధిలోకి ఇది రాదని ప్రభుత్వం చెప్పింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపించారు. ఏదైనా అశాస్త్రీయ విధానం ఉంటే, దాన్ని శాసనాల ద్వారా పరిష్కరించుకోవచ్చు అన్నారు. ప్రతి మతపరమైన విధానాన్ని గౌరవించాలని, ప్రతి అంశాన్ని హుందాతనానికి, శరీర స్వేచ్ఛకు ఆపాదించలేమన్నారు. మసీదుకు వెళ్లినా, గురుద్వారకు వెళ్లినా.. ముఖాన్ని కప్పుకోవాల్సి వస్తుందని, అప్పుడు నా గౌరవాన్ని, హక్కును లాక్కున్నారని అనలేమని తుషార్ మెహతా చెప్పారు. మతపరమైన స్వేచ్ఛను రాజ్యాంగం రక్షిస్తుందన్నారు.

# వలస కార్మికులకు కేంద్రం శుభవార్త

## ఇక నుంచి 5 కేజీల రెండు సిలిండర్ల సరఫరా

## రాష్ట్రాలకు సూచించిన కేంద్రం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** వలస కార్మికులకు కేంద్రం ఊరట కలిగించింది. వారికి గ్యాస్ సరఫరాపై పెట్రోలియం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. వలస కార్మికులకు 5 కేజీల ఎఫ్‌టీఎల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా రెట్టింపు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ లేఖ రాశారు. ఓఎంసీల సహాయంతో పౌర సరఫరాల శాఖ ద్వారా గ్యాస్ పంపిణీ చేయాలని సూచించారు. ఎల్‌పిజి గ్యాస్ కొరత వల్ల దేశంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వలస కార్మికుల సంగతి సరేసరి. ఈ నేపథ్యంలో వలస కార్మికులని దృష్టిలో ఉంచుకుని రోజుకి 5 కేజీల గ్యాస్ సిలిండర్ అడ్రస్ ప్రూఫ్ లేకుండా.. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని ఇటీవల కేంద్రం ప్రకటించింది. ఐదు కేజీల గ్యాస్ సిలిండర్ సమీపంలో ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్ల దగ్గర అందుబాటులో ఉంటుందని పెట్రోలియం శాఖ తెలిపింది. తాజాగా మంగళవారం వలసకార్మికులకు ఇచ్చే గ్యాస్ సిలిండర్ల సంఖ్యను కేంద్రం డబుల్‌కి పెంచింది. అంటే వలస కార్మికులు రోజుకి రెండు ఐదు కేజీల ఎల్‌పిజి సిలిండర్లను కొనుగోలు చేసేందుకు మంత్రిత్వశాఖ వీలు కల్పించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు మంత్రిత్వశాఖ లేఖ రాసింది. మార్చి 21వ తేదీన రాష్ట్రాల చీఫ్‌లకు రాసిన లేఖలో వలస కార్మికులకు ఐదు కేజీ సిలిండర్‌లను ఓఎంసి (ఆయిల్ మార్కెటింగ్ కంపెనీనీ)ల సహాయంతో ఇవ్వాలని లేఖ రాసింది. అయితే ఈ లేఖలో రాసిన దానికంటే 20 శాతం పరిమితికి మించి పెంచడం జరిగిందని, వలస కార్మికులకు సిలిండర్లను అందుబాటులో ఉంచాలని పెట్రోలియం శాఖ తాజాగా రాష్ట్రాలకు రాసిన లేఖలో పేర్కొంది.

# కోమాలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ

## కోడై కూస్తున్న అంతర్జాతీయ మీడియా

**టెహ్రాన్, ఏప్రిల్ 7:** ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ చాలా రోజుల నుంచి కోమాలో ఉన్నారన్న వార్త ఇప్పుడు ప్రపంచమంతా దావానలంలా వ్యాపిస్తోంది. ప్రస్తుతం ఖోమ్ నగరంలో చికిత్స పొందుతున్నారని కోడై కూస్తోంది. ఇరాన్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలలో మొజ్తాబా ప్రమేయం ఏమీ లేదని అంతర్జాతీయ మీడియా అంటోంది. మొజ్తాబా ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉన్నట్టు అమెరికా- ఇజ్రాయెల్ దేశాల నిఘా సంస్థలకు తెలుసని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. సుప్రీం లీడర్ అయిన తర్వాత కూడా మొజ్తాబా ఎక్కడా కనిపించలేదు. మొజ్తాబా తీవ్రంగా గాయపడ్డారని, ప్రాణాలు కూడా కోల్పోయి ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అప్పట్లో అన్నారు. ఖమేనీని చికిత్స నిమిత్తం రష్యాలోని మాస్కోకు తరలించారని కూడా వార్తలు వచ్చాయి. మొజ్తాబా ఖమేనీ ఇరాన్‌లోనే ఉన్నారని, బయటకు వెల్లడించలేని కారణాల వల్ల ఆయన బహిరంగంగా కనిపించడం లేదని రష్యా రాయబారి తెలిపారు. అయితే ఇప్పటివరకు ఇరాన్ ప్రభుత్వం లేదా అధికార వర్గాలు ఈ వార్తను అధికారికంగా ధ్రువీకరించలేదు.

# ఐదు రాష్ట్రాల్లో ఎగ్జిట్ పోల్స్ నిషేధం

## 9వ తేదీ నుంచి 29 వరకు అమలు

## కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన విడుదల




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్‌పై ఎన్నికల కమిషన్ నిషేధం విధించింది. ఏప్రిల్ 9వ తేదీ ఉదయం 7 గంటల నుండి ఏప్రిల్ 29వ తేదీ సాయంత్రం 6.30గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ సర్వే నిర్వహించడం, వాటి ఫలితాలను వెల్లడించకూ ఓడదని ఎన్నికల కమిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిర్దిష్ట సమయంలో ఎగ్జిట్ పోల్స్ నిర్వహించడం లేదా వెల్లడించడం ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 126ఎను ఉల్లంఘించడమేనని హెచ్చరించింది. ఉల్లంఘించిన వారికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష లేదా జరిమానా , లేదా రెండూ అమలు చేయవచ్చని ఆ ప్రకటనలో తెలిపింది.కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి సహా కేరళ, అస్సాం రాష్ట్రాల్లో ఏప్రిల్ 9న, తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమబెంగాల్‌లో రెండు దశల్లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరగనుంది. ఎన్నికల ఫలితాలు ఏప్రిల్ 30 వెలువడనున్నాయి. కేరళ, పుదుచ్చేరిల్లో మంగళవారం సాయంత్రం 6గంటలకు ప్రచారాన్ని నిలిపివేయాల్సి వుండగా, అస్సాంలో సాయంత్రం 5 గంటల నుండి నిషేధం అమలు కానుంది. పరిమిత సంఖ్యలో పార్టీ కార్యకర్తలు లేదా అభ్యర్థి ఇంటింటికి వెళ్లి చేసే ప్రచారం మినహా, మరే ఇతర ప్రచారానికి అనుమతి లేదు.

# దర్యాప్తులో జాప్యం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి

● పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** దర్యాప్తులో జాప్యం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశించారు. మంగళవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశంలో సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడారు. పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తులో ఉన్న కేసులు, వారెంట్ల అమలు, పోలీస్ సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఇప్పటివరకు నమోదైన కేసులు, పెండింగ్‌లో ఉన్న పాత కేసులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం త్వరితగతిన అందేలా న్యాయాధికారులతో సమన్వయం పాటించాలని సూచించారు. దొంగతనాల నివారణ, కేసుల ఛేదనపై సమీక్షిస్తూ నేరస్తులను పట్టుకోవడంలో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని ఆదేశించారు. రికవరీ శాతం పెంచి బాధితులకు వారి సొత్తును తిరిగి అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చోరీలకు పాల్పడే వ్యక్తులపై హిస్టరీ షీట్లు తెరవాలని తెలిపారు. చోరీలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలు, కాలనీలు, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరును స్టేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్ గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం పాటిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంచాలని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించి వారి ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వాలని ఆదేశించారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, అడిషనల్ డీసీపీ అడ్మిన్ కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు, ఇన్స్పెక్టర్లు, ఎసఐలు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవం

● సందర్భంగా కమాన్ పూర్ బీజేపీ మండల కేంద్రంలో మండల అధ్యక్షులు కొయ్యడ సతీష్ యాదవ్ జెండా ఎగారవేసి స్వీట్స్ పంచి సంబరాలు చేయడం జరిగింది



**మంథని, (ది క్రైమ్ న్యూస్):** భారతీయ జనతా పార్టీ 1980 వ సంవత్సరంలో ఏప్రిల్ 6 న స్థాపించబడి అంత్యోదయ లక్ష్యంతో ఏకత్మాత మనవవాదం సిద్ధాంతంగా పనిచేస్తూ నేడు ప్రపంచంలో అతి పెద్ద పార్టీ గా అవతరించి భారతదేశాన్ని 12సంవత్సరాలపైగా పరిపాలన చేస్తూ అవినీతి లేని ప్రభుత్వాన్ని నడిపిస్తున్న నరేంద్ర మోడీ గారి నేత్రుత్వంలో బీజేపీ మొదటి అధ్యక్షులు అటల్ బిహారి వాజ్పేయి గారు మరియు అభినవ సర్దార్ లాల్ కృష్ణ అద్వానీ గారి స్ఫూర్తితో అంచేలంచలుగా ఎదిగి నేడు అజేయ శక్తిగా నిలిచిన భారతీయ జనతా పార్టీ దేశంలోనే అత్యధిక రాష్టాలలో అధికారంలో వున్నా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం. సందర్భంగా శుభాకాంక్షలు శుభనందనలు.... తెలియజేస్తూ సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయస్ ధ్యేయంగా వికసిత్ భారత్ నిర్మాణంలో భాగమై ప్రతి కార్యకర్త పనిచేయాలి... కోరడమైనది ఈ కార్యక్రమం లో బిజెపి మండలాధ్యక్షుడు కొయ్యడ సతీష్ యాదవ్ బిజెపి పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు మచ్చగిరి రాము సీనియర్ నాయకులు మట్ట శంకర్ రామస్వామి మండల మాజీ అధ్యక్షుడు జంగపల్లి అజయ్ మల్లారపు అరుణ్ బర్ల సదానందం మండల్ జనరల్ సెక్రటరీలు విశ్వతేజ శ్యాంసుందర్ మట్ట మల్లేష్ కొమ్ము శ్రీనివాస్ మోర ప్రశాంత్ బుద్ధార్తి శ్రీనివాస్ పిల్లి చంద్రయ్య జంగా పెల్లి సారయ్య చాగంటి లక్ష్మణ స్వామి పిడుగు రమేష్ గొట్టి సంపత్ వేముల శ్రీనివాస్ లింగస్వామి ఆదిత్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కమాన్‌పూర్‌లో బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు: కీలక అంశాలపై చర్చ



**మంథని, ఏప్రిల్ 07, (ది క్రైమ్ న్యూస్):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కమాన్‌పూర్ మండలంలో బాలల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టేందుకు ముందడుగు పడింది. ఈ నేపథ్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సహకారంతో బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు కోసం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాలల సంక్షేమం, భద్రతకు సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ముఖ్యంగా బాల్య వివాహాలు, బాల కార్మికత్వం, పాఠశాల మానేసిన పిల్లలు, అనాధ బాలలు, బాలల అక్రమ రవాణా, బాలలపై వేధింపులను పూర్తిగా అరికట్టేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ప్రతి గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాలల హక్కులపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. అదేవిధంగా కమాన్‌పూర్ మండలాన్ని "బాలల స్నేహపూర్వ మండలం"గా అభివృద్ధి చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, బాలల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ పి. ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎంపీడీవో ఇన్‌చార్జ్ సౌమ్య, మంథని ప్రాజెక్ట్ సీడీపీఓ పుష్పలత, ప్రొటెక్షన్ ఆఫీసర్ కనకరాజు, మండల వైద్యాధికారి డా. శ్రీచందన, కమాన్‌పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ తో పాటు మండలంలోని గ్రామ సర్పంచ్‌లు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణ రెడ్డి, డీసీపీయూ యూనిట్ సభ్యులు శ్యామల, హరీష్, సతీష్, మండల సమైక్య అధ్యక్షురాలు శిరీష తదితరులు పాల్గొన్నారు. సమావేశం చైతన్యవంతంగా సాగింది.

# వ్యాధులు రాకముందే జాగ్రత్తలు తీసుకోవాలి

● మన ఆరోగ్యం.. మనదే బాధ్యత: మెడికవర్ వైద్యుల వెల్లడి







**కరీంనగర్ టౌన్, ఏప్రిల్7(ది క్రైమ్ న్యూస్):** వ్యాది వచ్చిన తర్వాత బాధపడేకంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో మేలని మన ఆరోగ్యం, మనదే బాధ్యతగా అనే బావనతో జీవనశైలిని మార్చుకోవాలని మెడికవర్ వైద్యులు వెల్లడించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో ఆరోగ్య అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ షుగర్, రక్తపోటు, గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు వంటి వ్యాధులు వచ్చినప్పుడు సోషల్ మీడియాపై ఆధారపడి స్వయంగా మందులు వాడడం ప్రమాదకరమని హెచ్చరించారు. సరైన పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందడం అవసరమన్నారు. అలాగే మద్యం సేవించడం, పొగ త్రాగడం, డ్రగ్స్ వినియోగం, జంక్ ఫుడ్ తీసుకోవడం వంటి అలవాట్లను మానుకోవాలని సూచించారు. పోషకాహారం తీసుకోవడం, శారీరక వ్యాయామం చేయడం, పనిలో ఒత్తిడిని తగ్గించుకోవడం, మంచి నిద్ర ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని తెలిపారు. ప్రస్తుతం రోగాలు అరికట్టే వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయని అవసరాన్ని బట్టి వాటిని తీసుకోవాలని సూచించారు. ఇటీవల 100 మందిని పరీక్షిస్తే 80 మందికి కొలెస్ట్రాల్ సమస్య ఉంటుందని, వారు రెగ్యులర్‌గా చికిత్స పొందకుండా నిర్లక్ష్యం చేస్తూ ప్రాణాలమీదకు తెచ్చు కుంటున్నారని వెల్లడించారు. అధునాతన వైద్యం అందుబాటులోకి వచ్చిందని గతంలో 40 సంవత్సరాలున్న జీవితకాలం ఇప్పుడు 75 సంవత్సరాలకు పెరిగిందని తెలిపారు. మెడికవర్ ఆసుపత్రిలో 25 మంది వివిధ స్పెషాలిటీల వైద్యులు సేవలందిస్తున్నారని వెల్లడించారు. సమాజంలో ప్రతి వ్యక్తి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకుని, ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకుంటేనే మంచి భవిష్యత్తు సాధ్యమని వైద్యులు స్పష్టం చేశారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో కార్డియాలజిస్టు డాక్టర్ అనీష్ పబ్బ, జనరల్ ఫిజీషియన్లు డాక్టర్ నాగరాజు, డాక్టర్ లోకేష్, క్రిటికల్‌కేర్ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ తాహా, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, దాసరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా బందెల రమేష్ నియామకం



**ధర్మపురి, ఎప్రిల్ 7, (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ధర్మపురి లో బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా బందెల రమేష్ నియామకం జరిగినట్లు అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం న్యాయవాదుల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం సాయంత్రం కోర్ట్ ఆవరణలో జరిగినట్లు వారు వివరించారు. ఈ ఎన్నికల కు ముఖ్య అతిథి గా ధర్మపురి కోర్ట్ న్యాయమూర్తి యేగి జానకి పాల్గొనడం జరిగిందని వివరించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఎలెక్షన్‌లో అధ్యక్షులుగా బందెల రమేష్13 ఓట్లు రాగా ప్రత్యర్థి కి 4 ఓట్లు రాగా 9 ఓట్లతో బందెల రమేష్ విజయం సాధించారని తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా రామడుగు రాజేష్ 9 ఓట్లు రాగా ప్రత్యర్థికి 8 ఓట్లు రాగా 1 ఓటుతో రామడుగు రాజేష్ గెలిచారు. ఎన్నికల అధికారిగా గూడ జితేందర్ రెడ్డి, కస్తూరి శరత్ కుమార్ లు వ్యవహరించగా ఉపాధ్యక్షులుగా మామిడాల శ్రీకాంత్ కుమార్, జాయింట్ సెక్రటరీగా ఒరగంటి చంద్రశేఖర్ లు, మహిళ ప్రతినిధి గా కలమడుగు కీర్తి, ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా సీనియర్ న్యాయవాదులు మరియు ధర్మపురి న్యాయవాదులు పాల్గొనారు.

# మోడల్ యునైటెడ్ నేషన్స్‌కు ఎంపికైన కమాన్‌పూర్ విద్యార్థులు





**మంథని, (ది క్రైమ్ న్యూస్):** కమాన్‌పూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న "తెలంగాణ రాష్ట్ర మోడల్ యునైటెడ్ నేషన్స్ (ఎవీఖచీ)" కార్యక్రమానికి ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచింది. పాఠశాల విద్యార్థుల ప్రతిభను గుర్తించిన జిల్లా స్థాయి సమావేశాల్లో వారి ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచింది. పెద్దపల్లి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో, జిల్లా సోషల్ ఫోరమ్ సహకారంతో శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ సెషన్స్ ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సమావేశాల్లో జిల్లాలోని 11 పీఎం శ్రీ పాఠశాలల నుంచి 38 మంది విద్యార్థులు వివిధ దేశాల ప్రతినిధులుగా పాల్గొని అంతర్జాతీయ సమస్యలపై తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. "బాలల హక్కులు, నాణ్యమైన విద్య, బాలల ఆరోగ్యం" వంటి కీలక అంశాలపై నిర్వహించిన చర్చలు, రోల్‌ప్లే కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, వాదన నైపుణ్యాలను పెంపొందించాయి. ఈ సందర్భంగా కమాన్‌పూర్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి రవిత్రేని ఇంటర్నేషనల్ మీడియా ప్రతినిధిగా, చరిష్మ డెలిగేట్‌గా రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇల్లందుల విజయ్ కుమార్ విద్యార్థులను అభినందిస్తూ, రాష్ట్రస్థాయిలో కూడా తమ ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. పెద్దపల్లి జిల్లా నుంచి మొత్తం 11 మంది విద్యార్థులు ఎంపిక కాగా, అందులో కమాన్‌పూర్ పాఠశాల నుంచి ఇద్దరు చోటు దక్కించుకోవడం ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది.

# అలరించిన గుడ్ మార్నింగ్ కల్చరల్ మీట్

**- పచ్చదనాన్ని పెంపొందించడం.. - మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం లాంటి సామాజిక అంశాల పై నాట్యం**




**గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** స్థానిక చంద్రశేఖర్ నగర్‌లో గల గుడ్ మార్నింగ్ గ్రామర్ స్కూల్ లో మంగళవారం నాడు కల్చరల్ మరియు స్పోర్ట్స్ మీట్ ఘనంగా నిర్వహించారు, పాఠశాల కరెస్పాండంట్ ఆధర్ సండే సమ్మారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో రామగుండము డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య ముఖ్య అతిథి గా హాజరై పారిశ్రామిక ప్రాంతంలో గత 40 సంవత్సరాలుగా అత్యుత్తమ నాణ్యమైన విద్యను అందిస్తూ ఎందరో అత్యుత్తమ విద్యార్థులను అందించిన స్కూల్ యాజమాన్యానికి అభినందనలు తెలియజేసారు, జ్యోతి ప్రజ్వలన అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమలు మరియు విద్యార్థుల చేత చేయబడిన సామజిక నృత్యాలు లో చెట్ల ను రక్షించడం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం ,రైతులు అనుభవించే కష్టాలు వివిధ నృత్య రూపాకలు చూపించి పలువురిని ఆలోచించేలా చేసాయి .ఇంకా ఈ కార్యక్రమం లో 45 డివిజన్ కార్పొరేటర్ కౌటాం సతీష్, 46 డివిజన్ కార్పొరేటర్ కొమ్ము స్వప్న వేణు పాఠశాల డైరెక్టర్ చందుపట్ల తిరుపతి రెడ్డి, ప్రిన్సిపాల్ ఊర సమ్మి రెడ్డి , ట్రస్మా జిల్లా గౌరవ అధ్యక్షులు పరుపాటి అంజిరెడ్డి, అధ్యక్షులు కంది రవీందర్ రెడ్డి , కార్యదర్శి కొత్త శ్రీనివాస్ రెడ్డి , వాక్ చైర్మన్ మొక్క రాజయ్య మరియు ఏఐజి హాస్పిటల్ న్యూరో సర్జన్ కె. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సుద్దాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బోర్వెల్ ప్రారంభం



**సుల్తానాబాద్, ఏప్రిల్ 07(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామ పంచాయతీ పరిధిలోని ఒకటవ వార్డులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (గ్రాఎజ) వద్ద మంగళవారం నూతనంగా బోర్వెల్ వేయించారు. గ్రామస్తులకు, ఆసుపత్రికి వచ్చే రోగులకు నీటి ఎద్దడి కలగకుండా ఉండేందుకు పంచాయతీ పాలకవర్గం ఈ నిర్ణయం తీసుకుంది.ఆరోగ్య కేంద్రం వద్ద నీటి సౌకర్యం కల్పించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఓజ్జ సంపత్ యాదవ్, ఉప సర్పంచ్ గుజ్జ వెంకన్న, పంచాయతీ కార్యదర్శి సాగర్ , ఏఎన్ఎం అనసూయ, వార్డు సభ్యులు ముత్యాల శ్రీనివాస్ (1వ వార్డు), అవునూరు భారతి (3వ వార్డు), కడారి సప్న - అశోక్ రావు (8వ వార్డు), చిక్కులపల్లి విజయలక్ష్మి - సంపత్ రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొత్త బెల్లం కంటే పాత బెల్లం వెయ్యిరెట్లు మంచిదట..

తాజా బెల్లం తినడం చాలా మందికి ఇష్టం. అయితే కొత్త బెల్లం కంటే పాత బెల్లం ఎక్కువ మేలు చేస్తుందని మీకు తెలుసా..? అవును.. ఆశ్చర్యంగా అనిపించినా ఇది పోషకాహార నిపుణులు చెబుతున్న మాట. నేటి నుంచి వంటగదిలో కొత్త బెల్లానికి బదులు పాత బెల్లాన్ని వాడటం ప్రారంభించండి. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. 1 నుండి 2 సంవత్సరాల కాలంపాటు నిల్వ చేసిన బెల్లం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. సుదీర్ఘ కాలంలో బెల్లంలోని యాంటీ ఆక్సిడెంట్, పోషక విలువలు పెరుగుతాయి.ఇందులోని మొలాసిస్‌ను వివిధ పోషకాలను అందిస్తుంది. పాత బెల్లం దుకాణాల్లో దొరుకుతుంది. కానీ దీని ధర కొంచెం ఎక్కువగా ఉంటుంది. బెల్లం అనేక పోషకాలను కలిగి ఉంటుంది. ఇది శరీరానికి శక్తిని అందించడంలో సహాయపడుతుంది. కార్బోహైడ్రేట్లు, ఐరన్, మెగ్నీషియం వంటి పోషకాలు బెల్లంలో పుష్కలంగా ఉంటాయి. బెల్లం మన జీర్ణక్రియను అనేక విధాలుగా మెరుగుపరుస్తుంది. బెల్లంలో అనేక రకాల ఎంజైమ్‌లు, ఫైబర్‌లు ఉంటాయి.

# హాలియాలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు

## ఘనంగా 2కె రన్, ఉచిత వైద్య శిబిరం





**నల్గొండ ప్రతినిధి, ఏప్రిల్ 07 (ది క్రైమ్ న్యూస్):** హాలియా మున్సిపాలిటీ పరిధిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి హాస్పిటల్స్ సౌజన్యంతో 2ఖ రన్‌ను తులసి హాస్పిటల్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు నిర్వహించారు. అనంతరం గుడ్లు, అరటి పండ్లు, మజ్జిగ వంటి పోషకాహారాన్ని పాల్గొన్న వారికి పంపిణీ చేశారు. అలాగే హాలియా మున్సిపాలిటీ ఆవరణంలో తులసి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న మున్సిపల్ కార్మికులు మరియు సిబ్బందికి అన్ని రకాల స్పెషలిస్ట్ డాక్టర్ల ద్వారా ఉచిత వైద్య పరీక్షలు, మందులు అందించడం అభినందనీయమని తెలిపారు. ప్రజలు ప్రతిరోజు శారీరక వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. గౌరవ మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి మాట్లాడుతూ యోగ మరియు రన్నింగ్ ఆరోగ్యానికి ఎంతో అవసరమని, ప్రతిరోజూ కొంత సమయం వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన 2ఖ రన్‌లో పాల్గొన్న వారందరికీ తులసి హాస్పిటల్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా, తులసి హాస్పిటల్ యజమాని మాలే సంతోష్ రెడ్డి సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు: మున్సిపల్ కమిషనర్ కే రవీందర్ రెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ గౌడ్, 2వ వార్డు సలహాదారు నగరికంటి సైదులు, 4వ వార్డు సలహాదారు కడమంచి శ్రీను, 5వ వార్డు సలహాదారు చిట్టిపోలు కరుణాసాగర్, 6వ వార్డు కౌన్సిలర్ బొంగరాల యేసు రాజు, 8వ వార్డు సలహాదారు మజహార్, 9వ వార్డు కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు, 10వ వార్డు సలహాదారు పిల్లి ఆంజనేయులు, 12వ వార్డు సలహాదారు ఎడవల్లి రంజిత్, హాలియా ఎస్.ఐ. సాయి ప్రశాంత్, పుర ప్రముఖులు, మున్సిపల్ సిబ్బంది మరియు ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# డంపింగ్ యార్డ్ నిర్ణయం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే బిజెపి తడాఖా చూపిస్తాం

- నిరాహార దీక్ష విరమణ సందర్భంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఘాటు వ్యాఖ్యలు





**కరీంనగర్ టౌన్, ఏప్రిల్7(ది క్రైమ్ న్యూస్):** హుజురాబాద్ రూరల్ మండలం సిర్సపల్లి శివారులో డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకుంటే బిజెపి తడాఖా చూపిస్తామని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. హుజురాబాద్ బిజెపి శ్రేణులు చేపట్టిన నిరాహార దీక్ష విరమణ కోసం మంగళవారం రోజున బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి హాజరై పై వ్యాఖ్యలు చేశారు. ప్రశాంతంగా ఉన్న హుజురాబాద్ ప్రాంతంలో కాంగ్రెస్ ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని తీసుకువచ్చి అశాంతి, అలజడిని సృష్టించిందని ఆయన మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం డంపింగ్ యార్డ్ విషయంలో ముందుకు వెళ్లి హుజురాబాద్ ప్రజలను గోసపెట్టాలనే చూస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. హుజూరాబాద్ ప్రాంత ప్రజలు గత 15 రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీలెత్తినట్టు వ్యవహరిస్తుందని ఆయన మండిపడ్డారు. హుజరాబాద్ లోని ప్రజా సంఘాలు, కుల సంఘాలు అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపై కి వచ్చి డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయవద్దని మొరపెట్టుకుంటే రాష్ట్ర ప్రభుత్వానికి వినిపించడం లేదా..? కనిపించడం లేదా..? అని ఆయన ఘాటుగా విమర్శించారు.. డంపింగ్ యార్డ్ ఇష్యూ రోజు రోజుకు తీవ్రతరమవుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకుండా మొద్దు నిద్రలో ఉందన్నారు. డంపింగు యార్డ్ ను రద్దు చేయకపోతే ఈ ప్రాంతంలో జీవించే ప్రజలకు నరకయాతన తప్పదని ,. గాలి, నీరు వాతావరణం మొత్తం కలుషితమై ఇక్కడి ప్రజానీక మనుగడకే ప్రమాదం తలెత్తే అవకాశం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, ఆ దిశగా వెంటనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం డంపింగ్ యార్డ్ రద్దు ప్రకటన చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్ యార్డ్ నిర్ణయం పట్ల మొండి వైఖరితో ఉంటే బిజెపి ఆధ్వర్యంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. బిజెపి పట్టణ మండల అధ్యక్షులు తూర్పాటి రాజు పారుపల్లి కొండాల్ రెడ్డి మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రాల నిర్మల రెడ్డి మాజీ పట్టణ మండల అధ్యక్షులు రాముల కుమార్ గంగిశెట్టి రాజు బిజెపి సీనియర్ నాయకులు గంగిశెట్టి ప్రభాకర్ కందుగుల సర్పంచ్ ముప్పు మహేష్ కౌన్సిలర్లు కోలుగురి సుమలత తూర్పాటి లక్ష్మి దుర్గ పట్టణ మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ కమిటీ అధ్యక్షుడిగా అరికిల్ల సతీష్ ఏకగ్రీవం



**ధర్మపురి, ఏప్రిల్ 7, (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ధర్మపురి మండల అంబేద్కర్ కమిటీ అధ్యక్షుడిగా అరికిల్ల సతీష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమీటీ సభ్యులు తెలిపారు. మంగళవారం ఈ ఎన్నికలు స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరనలో ధర్మపురి మండల అంబేద్కర్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని వివరించారు. ఈ ఏకగ్రీవ ఎన్నికల్లో ధర్మపురి మండల కమిటీ అధ్యక్షులు గా అరికిల్ల సతీష్, ఉపాధ్యక్షులు గా ముడిమడుగు శంకర్, ప్రధానకార్యదర్శి కుమ్మరి నవీన్, సహాయ కార్యదర్శి అల్లూరి పవన్ కుమార్, కోశాధికారి బరిగల ప్రశాంత్, ప్రచార కార్యదర్శి సిగిరి దాసులతో పాటు గౌరవ అధ్యక్షులుగా పారాపెల్లి రాజమల్లయ్య, రాగుల కాంతయ్య, మోలుగురి రాజన్న, ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. వీరితో పాటు 11 గౌరవ సభ్యులను ఎన్నిక చేశారు.ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధులు గా చిలుముల లక్ష్మన్ (నాగారం సర్పంచ్) దాసరి పురుషోత్తం (దోనూర్ సర్పంచ్) మాజీ కౌన్సిలర్ తరాల కార్తీక్, మాజీ మండల అధ్యక్షులు దొనకొండ నరేష్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు నేతకానీ సంఘము దుర్గం రవీందర్ నేతకానీ, ఆవునూరి శ్రీకాంత్, జంజీరికాని భారత్, టెంపుల్ డైరెక్టర్ బొల్లారపు పోచయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చందోలి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు పులి ప్రేమిత్, బత్తిని నరేష్, ఉపారపు రాజానర్సు, సుద్దాల నరేష్, ఆరెపల్లి ప్రశాంత్, దాసరి విజయ్, మండల దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రజక కార్పోరేషన్ను తెరిచి పాలక వర్గాన్ని నియమించాలి

- పూసాల సంపత్



**కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 7(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ లోని మధురానగర్, క్రిష్ణా నగర్ లో మంగళవారం రజక యువజన సమితి సదస్సును నిర్వహించారు. రాష్ట్ర రజక సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పూసాల సంపత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ....1982లో ఏర్పడిన రజక కార్పోరేషన్ ను తెరిచి పాలక వర్గాన్ని నియమించి కార్పోరేషన్ కు 1000కోట్లు కేటాయింపు, రజక సంఘాలకు లోన్లు,రజక నిరుద్యోగులకు ఉపాధి నిధులు కేటాయించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసి జనగామ జిల్లాకు ఐలమ్మ పేరును పెట్టాలన్నారు. హైదరాబాదులో రజక ఆత్మగౌరవ భవన నిర్మాణానికి స్థల కేటాయింపు, గ్రామాల్లోని వృత్తి చెరువులకు జివో 343 ప్రకారం రజకులకిచ్చి రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ దీనికై సమిష్టి పోరాటాలకు సిద్ధం కావాలని రజక యువకులకు పిలుపునిచ్చారు.సంఘ జిల్లా అధ్యక్షుడు రాచకొండ నరేష్, కార్యదర్శి కొత్తకొండ శ్రీనివాస్, గూడెపు మల్లేష్, నాంపెల్లి సంపత్, జాలిగం రాజు, శ్రీనివాస్, మధు తదితరులు సదస్సులో పాల్గొన్నారు.

# పదో వార్డులో నీటి సమస్యను పరిష్కరిస్తా

- సొంత ఖర్చులతో బోరు వేయించిన 10 వ వార్డు కౌన్సిలర్ ముద్దసాని సురేష్





**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని పదవ వార్డులో నీటి సమస్య లేకుండా పరిష్కరిస్తానని పదో వార్డు కౌన్సిలర్ ముద్దసాని సురేష్ తెలిపారు. వార్డులోని గడి పక్కన ప్రజలు నీళ్లకు ఇబ్బంది పడుతున్నారు అని తెలిసి తన సొంత ఖర్చులతో మంగళవారం బోరు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవి దృష్ట్యా ప్రజలకు నీటి సమస్య లేకుండా కృషి చేస్తానని తెలిపారు. వార్డులో అభివృద్ధి పనులను ఒక్కొక్కటిగా చేసుకుంటూ వెళ్తానని హామీ ఇచ్చారు . ఈ సందర్భంగా వార్డు ప్రజలు సురేష్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు ఉప్పల్ రెడ్డి,రాంరెడ్డి,మోహన్ రెడ్డి, నర్సింగోజు భగవంతయ్య, గూడ శ్రీనివాస్, నర్సింగోజు నరసింహాచారి,ఆకారపు సురేష్, నర్సింగోజు విక్రమ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఇద్దరికీ నేటిసంది కాంగ్రెస్‌తో ఏ సంబంధం లేదు: ఇట్లు, ముస్కు ఉపేందర్ రెడ్డి



**గన్నేరువరం, ఏప్రిల్ 7(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం పారువెల్లకు చెందిన చెక్కిల్ల తిరుపతి గౌడ్,బోద నర్సింహ రెడ్డి అనే ఇద్దరిని కాంగ్రెస్ నుండి సస్పెండ్ చేసినట్లు పార్టీ మండలాధ్యక్షుడు మస్కు ఉపేందర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. పార్టీలో ఉంటూనే వెన్నుపోటు చర్యల్లో భాగంగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ పార్టీకి నష్టం కల్గిస్తున్నందున ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు పార్టీ నుండి ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు ఉపేందర్ రెడ్డి తెలిపారు. నేటిసంది కాంగ్రెస్ పార్టీతో ఈ ఇద్దరికీ ఎలాంటి సంబంధం లేదని పెర్కొంటూ పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించినట్లు ఉపేందర్ రెడ్డి తెలిపారు.

# ఘనంగా జివి రామకృష్ణారావు పుట్టినరోజు వేడుకలు



**మానకొండూర్, ఏప్రిల్ 7 (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలోని బిఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ సుడా చైర్మన్ జీవి రామకృష్ణారావు పుట్టినరోజు వేడుకలను బిఆర్ఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు గజమాలతో సత్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన కేకును కోసి జివి రామకృష్ణారావు అభిమానుల మధ్య పుట్టినరోజును జరుపుకున్నారు.కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు హాజరై జీవి రామకృష్ణారావుకు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.నియోజకవర్గంలోని పలువురు పార్టీ నాయకులు వేడుకల్లో పాల్గొని జీవి రామకృష్ణారావుకు పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ స్థానిక మండలాధ్యక్షుడు మాజీ జెడ్పీటీసి తాళ్ళపల్లి శేఖర్ గౌడ్ మాట్లాడుతూ..... 2001లో పార్టీ ఆవిర్భావం నుండి బిఆర్ఎస్ జెండా మోస్తూ జిల్లా నుండి తెలంగాణా ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోశిస్తూ రాష్ట్ర సాధనకై కేసిఆర్ వెంట నడిచిన వ్యక్తి జీవి రామకృష్ణారావు అని కొనియాడారు. ఇటువంటి గొప్ప వ్యక్తి మానకొండూర్ వాసి అయినందుకు గర్విస్తున్నామని, రానున్న రోజుల్లో జీవి రామకృష్ణారావు మరిన్ని ఉన్నత పదవులు అదిరోహించి ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు జీవి అభిమానులు అధిక సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**ధర్మపురి, ఏప్రిల్ 7, (ది క్రైమ్ న్యూస్):** రోడ్డు ప్రమాదలో మృతి చెందిన పట్టణానికి చెందిన మాదాసు లచ్చన్న కుమారుడు అమర్నాథ్ కుటుంబాన్ని మంగళవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. పట్టణానికి చెందిన మాదాసు అమర్నాథ్ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి మనోధైర్యం చెప్పారు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్. ఈ పరామర్శలో కొప్పుల వెంట పట్టణానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# పిట్టల ఎల్లయ్యపల్లి గ్రామంలో 35 లక్షల అభివృద్ధి పనులు









**సుల్తానాబాద్, ఏప్రిల్ 07(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి నియోజక వర్గం ఓదెల మండలం పిట్టల ఎల్లయ్యపల్లి గ్రామంలో 15 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్లు ప్రారంభోత్సవం , రూ. 20 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ నిర్మాణం కోసం స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన భూమి పూజ చేసి పనులు ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ..ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజాప్రభుత్వం ఏర్పడ్డ రెండేళ్ల మూడు మాసల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టుకోవడం జరిగింది అని అన్నారు. ప్రజాపాలన - ప్రగతిప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసుకోవడం జరుగుతుంది అలాగే ప్రజా ప్రభుత్వంలో పిట్టల ఎల్లయ్యపల్లి గ్రామానికి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక 65 లక్షలు రూపాయల నిధులతో గ్రామ అభివృద్ధి కోసం వెచ్చించడం జరిగింది అని తెలిపారు. పాఠశాల కాంపౌండ్ వాల్ అంగన్వాడీ భవనం, మహిళా ఐకేపీ సంబంధించిన మహిళా సమైక్య భవనం కోసం వారం రోజుల్లో 5 లక్షల రూపాయల నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే గ్రామపంచాయతీ భవనం నిర్మాణం పూర్తి చేసుకోవడం జరుగుతుంది అని గ్రామప్రజల ఆలోచన మేరకే గ్రామ అభివృద్ధికి మంచి ప్రణాళికలు వేసుకొని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుకుందామని అన్నారు.: స్కూళ్లలో ఏఐ బోధన.. ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం త్వరలోనే పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బస్సు డిపో నిర్మాణం పూర్తి అవ్వడంతోనే పిట్టలఎల్లయ్య పల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తానని అలాగే ఓదెల నుండి పలు ప్రాంతాలకు ప్రజలు వెళ్లే విధంగా బస్సు సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500/- రూపాయలకు గ్యాస్ సిలిండర్, సన్నరకం వడ్లకు 500 బోనస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డుల మంజూరు, కళ్యాణలక్ష్మి/షాది ముబారక్ చెక్కులు అందించడం జరుగుతుంది అని అన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ద్వారా ఆర్థిక సహాయం, ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలు అమలులోకి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. దివ్యంగులైన ఇంటర్మీడియట్ విద్యార్థులకు రెట్రో ఫిట్టేడ్ మోటరైజ్డ్ వాహనలు పంపిణితో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను చేరవేసేలా ప్రభుత్వ కృషి చేస్తుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించడం జరిగింది అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంటూ అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తుందని రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు కలిగినా కూడా సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు మార్కెట్ డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పలు గ్రామాల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పారమిత విద్యాసంస్థలలో విద్యార్థుల సృజనాత్మకతకు పట్టం

- ఘనంగా ప్రాజెక్ట్ బేస్ట్ లెర్నింగ్ అవార్డుల ప్రధానోత్సవం





**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 7(ది క్రైమ్ న్యూస్):** స్థానిక అల్గునూర్ లోని పారమిత వరల్డ్ స్కూల్ లో 2025-26 విద్యాసంవత్సరానికి గాను ప్రతిష్టాత్మకమైన 'ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసనం' (పి.బి.ఎల్) అవార్డుల ప్రధానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద్ రావు ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రాజెక్ట్ ఆధారిత అభ్యసనం (పి. బి. ఎల్) అనేది పారమిత పాఠశాలల్లో అమలు చేయబడుతున్న ఒక సంవత్సరం పాటు కొనసాగే పూర్తిస్థాయి, సమగ్రమైన, వినూత్నమైన, బాలల కేంద్రీకృత, పరిశోధన ఆధారిత పాఠ్యప్రణాళిక. అర్థవంతమైన అభ్యసనం ద్వారా పిల్లలను తీర్చిదిద్దడంలో ఇది అత్యంత ముఖ్యమైన రంగాలలో ఒకటి. పారమిత పాఠశాలలు తమ వార్షిక పి.బి.ఎల్. అవార్డుల ప్రధానోత్సవాన్ని ఈరోజు నిర్వహించి, విజేతలను సత్కరించారు. పి. బి. యల్. ఫైనల్ ఎగ్జిబిషన్‌లో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు 200 మంది విద్యార్థులతో కూడిన 80 ఉత్తమ ఇన్నోవేటివ్ గ్రూప్ల ప్రాజెక్టులు ప్రదర్శించబడ్డాయి. పరిశోధన, సామాజిక శాస్త్రాల అనుసంధానం, మరియు సేకరణ వంటి వివిధ విభాగాల్లో ఈ ప్రాజెక్టులు విద్యార్థుల నైపుణ్యాలను, జ్ఞానాన్ని, మరియు ప్రతిభను చాటి చెప్పాయి. ప్రముఖ విద్యాసంస్థల నుండి వచ్చిన ప్రొఫెసర్ల బృందం ఈ ప్రాజెక్టులను మూల్యాంకనం చేసింది. ప్రతి తరగతి నుండి మొదటి మూడు ప్రాజెక్టులను మొత్తం 60 మంది విద్యార్థులతో కూడిన 12 ప్రాజెక్టులను వారి సృజనాత్మక విధానం, అత్యుత్తమ పనితీరు, మరియు వినూత్న పరిష్కారాల ఆధారంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద్ రావు విజేతలకు అవార్డులు మరియు సర్టిఫికేట్లు అందజేశారు. ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ ద్వారా పారమిత పాఠశాల తమ విద్యార్థులకు పరిశోధన ఆధారిత విద్యను అందిస్తోందని, ఇది ప్రస్తుత సామాజిక సవాళ్లకు వినూత్నమైన పరిష్కారాలను కనుగొనడానికి వారిని సిద్ధం చేస్తుందని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసన ద్వారా గత 10 సంవత్సరాలుగా దాదాపు 30 వేలకు పైగా విద్యార్థులు మరియు 500 కు పైగా ఉపాధ్యాయులు ప్రయోజనం పొందారని పి.బి.ఎల్ హెడ్ లలిత్ మోహన్ సాహు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, ప్రాచీ, వినోదరావు, వి.యు.ఎం.ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు శ్రీకర్, బాలాజీ, ప్రశాంత్, గోపీకృష్ణ, పి.బి.ఎల్ హెడ్ లలిత్ మోహన్ సాహు, పి.బి.ఎల్ సమన్వయకర్తలు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నిధుల కొరతతో ఇబ్బందులు

## జిన్నారం మున్సిపల్ తరపున కలెక్టర్‌కు వినతి



**పటాన్చెరు(జిన్నారం), ఏప్రిల్ 07(ది క్రైమ్ న్యూస్):** సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ చైర్మన్ నకీర్తి జనార్ధన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రావిణ్యను కలిసి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. జిన్నారం నూతన మున్సిపాలిటీలో తీవ్ర ఆర్థిక సమస్యలు నెలకొన్న నేపథ్యంలో పలు అభివృద్ధి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వివరించారు. మున్సిపల్ పరిధి గ్రామీణ ప్రాంతంగా ఉండటంతో అభివృద్ధిలో వెనుకబడి ఉందని, సరిపడా నిధులు లేకపోవడంతో ఉద్యోగులకు జీతాలు చెల్లించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అలాగే, మున్సిపాలిటీ పరిధిలో అనేక రహదారుల పరిస్థితి దారుణంగా ఉండటంతో బస్సులు సమయానికి రాక విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రావిణ్య, జిన్నారం మున్సిపల్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రభాకర్ రెడ్డి, పావని పరమేశ్వర్ రెడ్డి, బెలి కృష్ణ, ఆది గీతా రామకృష్ణ, పూజారి ప్రమోద్ రాజు, శ్రీలత, నాగరాజు, ఆశా దేవి, శంకరప్ప, శిల్పా నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గుమ్మడిదల సర్వే నెంబర్ 109 రైతులకు వంద గజాల స్థలం ఇవ్వాల్సిందే..

- అన్నారం రైతుల భూములు లాక్కుంటే ఉద్యమమే..
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..



**పటాన్చెరు, ఏప్రిల్ 07(ది క్రైమ్ న్యూస్):** రైతు ప్రభుత్వం అంటూ ప్రగల్భాలు పలుకుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం గుమ్మడిదల, అన్నారం రైతుల విషయంలో పక్షపాత వైఖరిని అవలంబిస్తూ.. వారి పాలిట ఆశనిపాతంగా మారుతోందని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని సర్వే నంబర్ 109 లో గల 140 మంది రైతులకు సంబంధించిన 160 ఎకరాలను గత సంవత్సరం టీజీఐసీసీకి ప్రభుత్వం కేటాయించింది. ఆ సమయంలో నష్టపరిహారంతో పాటు 100 గజాల ఇళ్ల స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చిన.. నేటి వరకు అమలుకావడం లేదంటూ మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో రైతులు మంగళవారం పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ భూములు సేకరించే సమయంలో అప్పటి కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు భూములు కోల్పోయిన 140 మంది రైతులకు 100 గజాలు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాల్సిందేనని అన్నారు. ఇళ్ల స్థలాల కోసం 5 ఎకరాలు సైతం ప్రత్యేకంగా కేటాయించారని రైతులు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ తో చర్చించి.. ప్రతి రైతుకి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా అన్నారం పరిధిలోని సర్వేనెంబర్ 261లో 117 మంది పేద రైతులకు సంబంధించిన 117 ఎకరాల అసైన్డ్ భూములను పరిశ్రమలకు కేటాయించే నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజా ఉద్యమాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, షేక్ హుస్సేన్, రైతులు పాల్గొన్నారు.

# ఆరోగ్య పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి: జడ్జి దుర్గం గణేష్



**సుల్తానాబాద్, ఏప్రిల్ 07(ది క్రైమ్ న్యూస్):** ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించాలని సుల్తానాబాద్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ అన్నారు. మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు బార్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రతిమ ఫౌండేషన్ చే ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం ను జడ్జి గణేష్ ప్రారంభించారు. ప్రతిమ హాస్పిటల్ వైద్యులు న్యాయవాదులకు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బందికి, కక్షిదారులు తో పాటు సుమారు 150 మందికి బి.పి., షుగర్, ఇసీజీ, కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆహారం విషయంలో శ్రద్ధ వహించాలని, ఆకు కూరలు, మిటమిన్లు లభించే ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. రైస్ మిల్లుల ద్వారా వచ్చే కాలుష్యంతో రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వయసు మీరిన వారికి మితాహారం శ్రేయస్కరం అని అన్నారు. వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వొడ్నాల రవీందర్, ప్రధాన కార్యదర్శి అవునూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఆవుల శివకృష్ణ, ఏపీపీ శ్యామ్ ప్రసాద్ రావు, ఏజీపీ దూడం ఆంజనేయులు, ప్రతిమ సీఈవో సి. రాంచందర్ రావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సి యన్ ప్రసాద్, హెల్త్ క్యాంప్ ఇంచార్జ్ కౌశిక్, ప్రతిమ ఫౌండేషన్ మేనేజర్ గీతా రెడ్డి, న్యాయవాదులు ఆవుల లక్ష్మి రాజం, పడాల శ్రీరాములు బోయిని భూమయ్య పడాల అంజయ్య, జోగుల రమేష్, సామల రాజేంద్రప్రసాద్, వడ్లకొండ రవికిరణ్, మల్యాల కరుణాకర్, ఆర్. నర్సయ్య, వేముల స్నేహ, మాడూరి పృథ్వీ, లెక్కల గంగాధర్ లతో పాటు ప్రతిమ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టర్ స్పందిస్తే త్వరలోనే కొత్త రోడ్డు: ఎమ్మెల్యే కవ్వంపల్లి





**మానకొండూర్, ఎప్రిల్ 7(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో పాటు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం పర్యటించారు. మండలకేంద్రం నుండి శ్రీనివాస్ నగర్, జగ్గయ్యపల్లి, లింగాపూర్, వెల్ది, లక్ష్మీపూర్, వేగురుపల్లి గ్రామాలకు వెళ్ళే మార్గంలో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, వంతెనలను పరిశీలించారు. అధ్వాన్నంగా మారిన రోడ్లతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం విని కలెక్టర్ రోడ్ల పరిశీలనకు వచ్చారని, పరిస్థితిని గుర్తించిన కలెక్టర్ స్పందిస్తే త్వరలోనే కొత్త రోడ్డుకు అనుమతి లభిస్తుందంటూ ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డివో మహేశ్వర్, తహశీల్దార్ విజయ్ కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి,మార్కెట్ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి,నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, పెంచాల కిషన్ రావు, బుర్ర శ్రీకాంత్ గౌడ్ తదితరులు కలెక్టర్, ఎమ్మెల్యే వెంట పరిశీలనలో పాల్గొన్నారు.

# ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపి అనుమతులు పొందేలా చూస్తాం: కలెక్టర్ చిత్రా మిశ్రా



**తిమ్మాపూర్, ఎప్రిల్ 7(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్గునూరు, నల్లగొండ గ్రామాల్లో నివేశ స్థలాలు లేని నిరుపేద కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇప్పించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు అల్గునూరులో 4 ఎకరాలు, నల్లగొండలో 2-10 ఎకరాల ప్రభుత్వ స్థలలాను కలెక్టర్ చిత్రా మిశ్రా, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలను నిరుపేదలకు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరగా, అసైన్ మెంట్ కమిటీ ఆమోదం మేరకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపి అనుమతులు పొందేలా చూస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్,ఆర్డివో మహేశ్వర్, తహశీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, పార్టీ మండలాధ్యక్షుడు బండారి రమేశ్, నాయకులు గోపు మల్లారెడ్డి, కంది లక్ష్మీనారాయణ రెడ్డి, అశోక్ రెడ్డి,చిందం కిష్టయ్య, శ్రీకాంత్, నాగేందర్, సర్పంచ్ మారుతి తదితరులు కలెక్టర్, ఎమ్మెల్యే వెంట స్థలాల పరిశీలనలో పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ముందడుగు

## ● పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ముందడుగు వేస్తున్నామని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల, నల్లగండ్ల హుడా కాలనీ, నవోదయ కాలనీ, సైబర్ కమ్యూన్ కాలనీలలో రూ.9.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన అంతర్గత డ్రైనేజీ పైప్‌లైన్, ఔట్‌లెట్ నిర్మాణ పనులపై పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం వివేకానంద నగర్‌లోని ఆయన కార్యాలయంలో జలమండలి ప్రాజెక్ట్స్ విభాగం అధికారులతో జరిగింది. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ వర్షాకాలానికి ముందే పనులను పూర్తి చేయాలని, పనుల వేగాన్ని పెంచాలని అధికారులకు సూచించారు. నవోదయ కాలనీ నుండి నల్లగండ్ల హుడా కాలనీ వరకు ఎస్ టి పి కి అనుసంధానం చేసే యూజీడీ పైప్‌లైన్ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్ పూర్తైతే కాలనీలలో సంవత్సరాలుగా కొనసాగుతున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అదేవిధంగా నల్లగండ్ల హుడా కాలనీ వద్ద 10 ఎంఎల్డి సామర్థ్యంతో రూ.28 కోట్ల వ్యయంతో నిర్మించిన ఎస్టిపి ద్వారా కాలనీల మురుగు నీరు శుద్ధి చేయబడుతుందని, చెరువులు కలుషితం కాకుండా పరిరక్షణ జరుగుతుందని పేర్కొన్నారు. నగరంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, తాగునీటి సరఫరా, మురుగు నీటి శుద్ధిలో హైదరాబాద్ ప్రత్యేక స్థానంలో నిలుస్తుందని తెలిపారు. పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకూడదని, ఆలస్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జలమండలి ప్రాజెక్ట్స్ విభాగం సీజీఎం పద్మజ, డీజీఎం భార్గవి, జీఎం కృష్ణ, డీజీఎం శ్రీహరి, మేనేజర్లు అరుణ్, లోకేష్, ఈశ్వర్, నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక సదుపాయాలతో రహదారులు అభివృద్ధి

## ● పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రజల సౌకర్యార్థం ఆధునిక సదుపాయాలతో రహదారులు అభివృద్ధి చేస్తామని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. మంగళవారం చందానగర్ డివిజన్ పరిధిలో జాతీయ రహదారి ( ఎన్ హెచ్ -65) బీహెచ్ఈఎల్ కల్వర్టు నుంచి నాల మీదుగా శ్రీదేవి థియేటర్ రోడ్డువరకు ప్రతిపాదించిన లింక్ రోడ్ పనులను పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రాజెక్ట్స్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లింక్ రోడ్ నిర్మాణంతో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి ప్రజలకు సమయం, ఇంధనం ఆదా అవుతుందని తెలిపారు. ప్రతిపాదనలు త్వరగా పూర్తి చేసి పనులు వేగవంతంగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ వరకు రూ.45 కోట్ల అంచనాతో 2.7 కిలోమీటర్ల పొడవులో 4 లేన్ల ప్రధాన రహదారి, 2 లేన్ల సర్వీస్ రహదారి విస్తరణ పనులు చేపట్టడం సంతోషకరమని చెప్పారు. పనుల్లో ఎటువంటి ఆలస్యం లేకుండా పక్క ప్రణాళికతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు విస్తరణతో చుట్టుపక్కల కాలనీల ప్రజలకు, వాహనదారులకు ఎంతో ఉపశమనం లభిస్తుందని, ఎన్నో ఏళ్లుగా ఉన్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా ఇది కీలక అడుగు అవుతుందని పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గతంలోనే అనేక ఫ్లైఓవర్లు, అండర్ బ్రిడ్జిలు, లింక్ రోడ్లు నిర్మించి ట్రాఫిక్ సమస్యలను తగ్గించామని గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్స్ విభాగం డీఈ శిరీష, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# యువత రాజకీయాల్లో రాణించాలి : మారబోయిన రవి కుమార్ యాదవ్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రస్తుత కాలంలో యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొనడం అత్యంత అవసరమని, దేశ నిర్మాణంలో, సమాజ అభివృద్ధిలో యువశక్తి కీలక పాత్ర పోషిస్తుందని, కొత్త ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక బాధ్యత కలిగిన యువత రాజకీయాల్లోకి రావడం ద్వారా పారదర్శకత, అభివృద్ధి, ప్రజాసేవ మరింత బలపడుతుందని మారబోయిన రవి కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం మదీనగూడ డివిజన్ పరిధిలోని మదీనగూడ గ్రామానికి చెందిన సుమారు 60 మంది యువత బీజేపీలో చేరారు. బీజేవైఎం రాష్ట్ర నాయకుడు నందనం విష్ణు దత్ ఆధ్వర్యంలో యువత బైక్ ర్యాలీగా మసీద్‌బండ కార్యాలయానికి చేరుకుని పార్టీ పట్ల తమ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ మాజీ అభ్యర్థి మారబోయిన రవి కుమార్ యాదవ్ యువతకు పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. యువత చేరికతో పార్టీకి మరింత బలం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోపుగుండా మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు రచమళ్ల నాగేశ్వర్ గౌడ్, సత్యనారాయణ రాజు, రమణయ్య, హాఫిజ్‌పేట్ నాయకుడు మహేష్ యాదవ్, మదీనగూడ డివిజన్ నాయకులు పాలం శ్రీనివాస్, మొగుళప్ప, వెంకటేష్ ముదిరాజ్, ఆకాష్, వేణు, నరేష్, మహిళా మోర్చా నాయకురాళ్లు పద్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉపాధి అవకాశాలను బలోపేతం చేయడానికి టీజీసీహెచ్ఈ తొలి తరహా ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ప్రారంభం




**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో చైర్మన్ నాయకత్వంలో విద్యార్థుల ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు, వృత్తిపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు మరియు ఉన్నత విద్యా పాలన, విధానాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా రూపుదిద్దుకున్న తొలి తరహా స్ట్రక్చర్డ్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నుంచి 15 మంది విద్యార్థినులను ఇంటర్న్‌లుగా ఎంపిక చేసినట్లు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు నైపుణ్యాలను పొందడమే కాకుండా, తెలంగాణలో ఉన్నత విద్యా రంగ రూపాంతరానికి తమ వంతు సహకారం అందించే అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రొఫెసర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో ఇంటర్న్‌షిప్‌లు ఉద్యోగ అవకాశాలకు కీలకమైన ముందస్తు అర్హతగా మారాయని అన్నారు. ఇవి పరిశ్రమ అనుభవం, జ్ఞానం అందించడంతో పాటు ప్రముఖ సంస్థల నుంచి ప్రీ-ప్లేస్‌మెంట్ ఆఫర్లు పొందే అవకాశాలను పెంచుతాయని తెలిపారు. విద్యా బోధన మరియు వాస్తవ ప్రపంచ అనుభవాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఆయన వివరించారు. ఈ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఉన్నత విద్యా పరిపాలన, విధాన రూపకల్పన మరియు సంస్థల పనితీరుపై సమగ్ర అవగాహన పొందేలా రూపొందించబడింది. అనుభవజ్ఞులైన మెంటర్ల పర్యవేక్షణలో ఇంటర్న్‌లు పనిచేస్తూ, వారి పనితీరును పనితన నాణ్యత, సమయపాలన, వృత్తిపరమైన ప్రవర్తన మరియు సృజనాత్మకత ఆధారంగా నిరంతరం మూల్యాంకనం చేయబడుతుంది. విస్తృత దృష్టికోణాన్ని వివరిస్తూ, టీజీసీహెచ్ఈ ఈ కార్యక్రమాన్ని వ్యవస్థీకృతంగా అమలు చేసి, పరిశోధన, విధాన రూపకల్పన మరియు విద్యా నాయకత్వంలో ప్రతిభావంతులైన యువతను తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలు మరియు బహుళ శాస్త్ర సంబంధిత సహకారం పెంపొందుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యా బోధనను పాలన మరియు విధాన రూపకల్పన ప్రక్రియలతో అనుసంధానం చేసి, భవిష్యత్తులో విద్యా రంగంలో నాయకత్వ బాధ్యతలు చేపట్టేలా విద్యార్థులను సిద్ధం చేయడం దిశగా టీజీసీహెచ్ఈ ఒక కీలక అడుగు వేసినట్లైంది.

# రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదం ఆటోను ఢీకొన్న కారు: ఆటో డ్రైవర్ మృతి







**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** గోదావరిఖని నగర శివారులోని డిగ్రీ కళాశాల రాజీవ్ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున ఆటోని కారు ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ ఎండి.ఇస్మాయిల్ (40) రోడ్డుపై డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. వన్ టౌన్ పోలీస్‌ల కథనం ప్రకారం... మంగళవారం తెల్లవారుజామున రామగుండం ముబారక్ నగర్‌కు చెందిన ఎండి.ఇస్మాయిల్ తన ఆటోలో ఎన్టీపీసీ నుంచి గోదావరిఖని బస్టాండ్ వైపు బిజిలీ రాధ అనే ప్రభుత్వ ఉపాధ్యాయురాలితో వస్తున్న క్రమంలో కళ్యాణ్ నగర్‌కు చెందిన బొంకూరి పవన్ కుమార్ హైదరాబాద్‌కు తన మిత్రులైన చిరంజీవి, రాజేష్‌తో స్విఫ్ట్ డిసైర్ కార్‌లో వెళ్లి వస్తూ డిగ్రీ కళాశాల ఎదురుగుండా వెళ్తున్న ఆటోను వెనకవైపు నుంచి వచ్చి ఢీకొట్టాడు. దీంతో ఆటో, కారు రెండు రహదారిపై బోల్తా పడ్డాయి. దీంతో ఆటో నడుపుతున్న ఇస్మాయిల్ ఎగిరి కిందపడి తన తల రోడ్డు పక్కన గల డివైడర్‌కు తాకింది. దీంతో తీవ్ర రక్త గాయాలతో ఇస్మాయిల్ అక్కడికక్కడ మృతి చెందగా, ఆటోలో ప్రయాణిస్తున్న బిజిలి రాధ అనే ప్రభుత్వ ఉద్యోగిరాలికి తలకు గాయాలు కాగా మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. కారులో ప్రయాణిస్తున్న పవన్ కుమార్, చిరంజీవి, రాజేష్‌లకు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. మృతి చెందిన ఇస్మాయిల్‌కు భార్య, ఇద్దరు కూతుర్లు ఉండగా, మృతిని సోదరుడు ఎండీ.ఇబ్రహీం ఇచ్చిన పిర్యాదు మేరకు వన్ టౌన్ సీఐ ఇంద్రసేన రెడ్డి పవన్ కుమార్‌పై కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# వరద నీటి కాలువ నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మియాపూర్ డివిజన్ పరిధిలో రామసముద్రం కుంట చెరువు నుంచి గురునాథం చెరువు వరకు చేపట్టిన స్టార్మ్ వాటర్ డ్రైన్ (వరద నీటి కాలువ) నిర్మాణ పనులను మంగళవారం కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అధికారులు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎంసీ, ఎస్ ఎన్ డి పి అధికారులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించిన ఆయన, వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఈ ప్రాజెక్ట్ కీలకమని తెలిపారు. కాలువ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి, వర్షాకాలంలో నీటి ప్రవాహం సాఫీగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయితే మియాపూర్ పరిధిలోని కాలనీ వాసులకు, ప్రయాణికులకు, వాహనదారులకు పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. మియాపూర్ అభివృద్ధి కోసం ఆరెకపూడి గాంధీ సహకారంతో నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ మౌలిక వసతుల అభివృద్ధి కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎన్ డి పి డీఈ ధీరజ్, సిఎంసీ అధికారులు ఏఈ ప్రశాంత్, సరిత, వర్క్ ఇన్స్పెక్టర్లు జగదీష్, నవీన్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో రాకెర్జ్ జిమ్నాస్టిక్స్ టీమ్ విజయం




**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** న్యూఢిల్లీ ద్వారకలో ఏప్రిల్ 3 నుంచి 5 వరకు నిర్వహించిన 4వ ఆల్ ఇండియా లెవల్ వైజ్ జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్ 2026-27లో రాకెర్జ్ జిమ్నాస్టిక్స్ టీమ్ విశేష ప్రతిభ కనబరిచింది. జట్టు 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది.లెవల్-3 బాలురు విభాగంలో మహమ్మద్ కాశిఫ్ హుస్సేన్, అఖిలేష్ రజత పతకాలు గెలుచుకోగా, భువన్, ధర్షత్, తేజస్, కృతార్ధ్ కాంస్య పతకాలు సాధించారు. లెవల్-3 బాలికల విభాగంలో ఆరుషి, ఓజల్, అమైరా కాంస్య పతకాలు అందుకోగా, లెవల్-4 బాలికల విభాగంలో మన్యథ, తన్యా కాంస్య పతకాలు గెలుచుకున్నారు. ఈ విజయంతో జట్టు కోచ్ డేవిడ్, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.

# జీవన్ రెడ్డికి తోడుగా యువ నాయకత్వం



**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల రాజకీయ వాతావరణంలో నేడు ఒక సానుకూల దృశ్యం కనిపించింది - అనుభవం, ఆత్మస్థైర్యం, యువ శక్తి ఒకే వేదికపై కలిసిన క్షణం. జగిత్యాలలో జీవన్ రెడ్డిని పరామర్శించిన యువ నాయకులు -- ధైర్యానికి నిలువెత్తు అండ జగిత్యాల జిల్లాలోని వారి నివాసంలో మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని ఈరోజు ఉదయం ప్రముఖ యువ నాయకులు కలిశారు. పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేసిన అభ్యర్థి కట్కూరి సందీప్, అలాగే యువ నాయకుడు ఎలుకపల్లి వెంకటేష్ లు కలిసి ఆయనను పరామర్శించి, మనోధైర్యం నింపారు. ఇది కేవలం ఓ మర్యాదపూర్వక భేటీ కాదు పోరాటం చేసే నాయకుడికి వెన్నుదన్నుగా నిలిచే కొత్త తరం సంకల్పం. జీవన్ రెడ్డి గ చూపిస్తున్న ధైర్యస్ఫూర్తి, ప్రజల పట్ల ఉన్న అంకితభావం యువ నాయకుల్లో స్ఫూర్తిని నింపుతున్నాయని సందీప్, వెంకటేష్ పేర్కొన్నారు. “నాయకత్వం అంటే కష్టకాలంలో కూడా నిలబడటం జీవన్ రెడ్డి అందుకు ప్రతీక” అని వారు స్పష్టం చేశారు. ఈ భేటీతో ఒక సందేశం స్పష్టంగా బయటపడింది: పాత అనుభవం కొత్త శక్తి కలిస్తే రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలవుతుంది. జగిత్యాల రాజకీయాల్లో ఈ సంఘటన చర్చనీయాంశంగా మారింది. ధైర్యం ఉన్న నాయకుడికి తోడుగా నిలిచే చేతులు పెరుగుతున్నాయి.

# జీవీ రామకృష్ణారావుకు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ



**సుల్తానాబాద్, ఏప్రిల్ 07(ది క్రైమ్ న్యూస్):** బిఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు తాళ్ళపల్లి మనోజ్ గౌడ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రామకృష్ణారావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని మనోజ్ గౌడ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హిందూ సమ్మేళన గోడ ప్రతి ఆవిష్కరణ...



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్7(ది క్రైమ్ న్యూస్):** తిమ్మాపూర్ మండలం పర్లపల్లి ఉప మండలం నల్లగొండ శ్రీ సీతారామ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఈనెల 11న జరగబోయే హిందూ సమ్మేళన గోడ ప్రతిని మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. సామాజిక సమరత తెలంగాణ ప్రాంత సభ్యులు పుల్లూరి రామారావు , శ్రీ సీతారామ లక్ష్మీనరసింహస్వామి హిందూ సమ్మేళన నిర్వహణ సమితి బాధ్యులు హిందూ సమ్మేళన పోస్టర్ ను ఆవిష్కరించి మాట్లాడారు. 11న శ్రీ సీతారామ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ప్రాంగణంలో తలపెట్టిన హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. దేశానికి ఆత్మ హిందూ ధర్మం మని, హిందూ సంస్కృతి, హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి సమైక్యపరచడానికే హిందూ సమ్మేళనం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. హిందువులు ఎదుర్కొంటున్న అనేకసవాళ్లనుపరిష్కరించుకోవడానికి ఐక్యమత్యంతో ముందు కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి హిందువులో ఆత్మవిశ్వాసాన్ని, ఐకమత్యాన్ని నింపడం, దేవాలయ వ్యవస్థ పటిష్టం చేయడం, సమాజంలో సామాజిక సమరతను నిర్మాణం చేయడం, కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడం, స్వదేశీ వస్తువుల వాడకాన్ని ప్రోత్సహించడం, జాతీయ భావాన్ని పెంపొదించడం కోసం హిందూ సమాజం ఐక్యతతో ముందు కొనసాగేలా చేయడమే హిందూ సమ్మేళన ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరత తెలంగాణ ప్రాంత సభ్యులు పుల్లూరి రామారావు,హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షులు బోనాల మోహన్ ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ , చింతం శ్రీనివాస్ , తిరుపతి రెడ్డి, కొయ్యడ శ్రీనివాస్ , ఓదెలు లతో పాటు ముఖ్య అతిథులుగా, నల్లగొండ గ్రామ సర్పంచ్ జినుక మారత్ గారు, పర్లపల్లి గ్రామ సర్పంచ్ సూరం స్వప్నమహేందర్ రెడ్డి, మట్టపల్లి గ్రామ సర్పంచ్ గాండ్ల శ్రీనివాస్ , మల్లాపూర్ గ్రామ సర్పంచ్ మామిడి మమత సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్య లేనిదే ఏ మనిషి కూడా సమాజంలో గుర్తింపు లభించదు

● విద్యార్థులు విలువలతో ఎదగాలి ● ఎంతో ఘనంగా రెయిన్బో పాఠశాల వార్షికోత్సవం ● కరస్పాండెంట్ వెలిషోజు శ్రీధర్







**రామగిరి, ఏప్రిల్ 07(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం కల్వచర్ల లోని రెయిన్బో ఇంగ్లీష్ మీడియం పాఠశాల వార్షికోత్సవం ఎంతో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి సర్పంచ్ రెండ్ల శారద మాట్లాడుతూ విద్య వినయాన్ని తెచ్చిపెడుతుందని విద్య లేనిదే ఏ మనిషి కూడా సమాజంలో గుర్తింపు లభించదని తెలిపారు. విద్యార్థులు విలువలతో ఎదగాలని అప్పుడే ఉన్నతమైన స్థానంలో ఉంటారని తెలిపారు. కరస్పాండెంట్ వెలిషోజు శ్రీధర్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నతమైన స్థానంలో ఉండాలంటే ఎలా ఉండాలో తెలిపారు. విద్యార్థులను పాఠశాలకు పంపిస్తే దాని పూర్తి బాధ్యత ఉపాధ్యాయులకు పాఠశాల యాజమాన్యానికి మాత్రమే ఉండదని తల్లిదండ్రుల పాత్ర కూడా ఉండాలని తెలిపారు. యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంకృతిక కార్యక్రమాలు నభూతో న భవిష్యత్ అన్న విధంగా ఎంతో ఆకర్షణీయంగా సూపర్ లను ఆకట్టుకునే విధంగా ప్రదర్శించారు. అలాగే ఒలంపియాడ్ పరీక్షలలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులకు అతిథులు మెడల్స్ బహుకరించి అభినందించారు. ట్రస్మా రాష్ట్ర సభ్యులు మోహన్ రాజ్ మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే పిల్లలను అన్ని రంగాలలో ప్రోత్సహిస్తూ పాఠశాలను ముందుకు నడిపిస్తున్నారని అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్య అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు నీల పద్మనాభన్,అర్వి లిటిల్ కిడ్స్ కరెస్పాండంట్ మూర్తి, కాకతీయ టెక్నో స్కూల్ ఇంచార్జ్ స్వాతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రెండు సంవత్సరాల 11 నెలల అత్యంత పిన్న వయస్సులోనే చదరంగంలో ప్రపంచ రికార్డును సాధించిన ఏకైక బాలుడిగా నిలిచిన కొండా శ్రేయాన్ష్ మురళీ కృష్ణ పటేల్





**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** రాయ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రెండు అసాధారణ రికార్డులను నెలకొల్పి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్) స్థానం సాధించిన కొండా శ్రేయాన్ష్ కృష్ణ పటేల్ 15 నిమిషాల 52 సెకండ్స్ లలో 93 బ్యాక్ ర్యాంక్ చెక్ మేట్స్ ను పరిష్కరించడంతో పాటు, 1 గంట 9 నిమిషాల 9 సెకండ్స్ లలో 21 చెస్ బోర్డ్ లను అమర్చి రెండు ప్రపంచ రికార్డులను సాధించి చరిత్ర సృష్టించిన శ్రేయాన్ష్ కృష్ణ పటేల్ ఈ రోజు జూబ్లీహిల్స్ లోని ఎమ్మెల్యేస్ అండ్ ఎంపీస్ కాలనీ కల్చరల్ సెంటర్ లో వేడుకగా జరిగిన కార్యక్రమం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి శ్రేయాన్ష్ కృష్ణ పటేల్ ప్రపంచ రికార్డ్ సాధించి, భరతమాత ముద్దు బిడ్డగా, అపార మేధస్సు కలిగిన స్వామి వివేకానందునిగా అవతరించాడని కీర్తించిన మంత్రి వాకిటి శ్రీహరి కొండా శ్రేయాన్ష్ మురళీ కృష్ణ పటేల్ కు క్రీడాశాఖ మంత్రిగా, క్రీడల పై ఇష్టం ఉన్న వ్యక్తిగా సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ తన మనవడి ప్రతభను చూసి మురిసిపోయిన మంత్రి సురేఖ ఉద్వేగంతో ఆనంద భాష్పాలు రాల్చిన మంత్రి సురేఖ, శ్రీయాన్ష్ అమ్మగారు కొండా సుస్మిత పటేల్ శ్రేయాన్ష్ పటేల్ అభిరుచుల మేరకు భవిష్యత్ లో తమ సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపిన కొండా సుస్మిత పటేల్ కొండా శ్రేయాన్ష్ పటేల్ ప్రతిభా సామర్థ్యాలు, మేధస్సు అమోఘమని ప్రశంసించిన చెస్ అకాడమీ వ్యవస్థాపకుడు రాజశేఖర్ రెడ్డి మరెందరో చిన్నారులకు శ్రేయాన్ష్ ప్రేరణగా నిలుస్తాడని కితాబు రాయ్ చెస్ అకాడమీ వ్యవస్థాపకుడు శ్రీ రాజశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో, నేషనల్ ఆర్బిటార్ ఉజ్వల్ చౌహాన్ జడ్జిగా సాగిన కార్యక్రమం శ్రేయాన్ష్ కృష్ణ పటేల్ ను ప్రశంసలతో ముంచెత్తిన వేదిక రాయ్ చెస్ అకాడమీ తరఫున కొండా శ్రేయాన్ష్ పటేల్ కు ట్రోఫీలు, సర్టిఫికెట్ లను ప్రదానం చేసిన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి త్వరలో వరల్డ్ బుక్ ఆఫ్ లండన్ ద్వారా బ్రిటిష్ పార్లమెంట్లో సత్కారంతో పాటు సర్టిఫికెట్ ను పొందనున్న శ్రేయాన్ష్ కృష్ణ పటేల్ మంత్రి శ్రీమతి కొండా సురేఖ, మురళీధర్ రావుల మనవడు కొండా శ్రీయాన్ష్ మురళీకృష్ణ పటేల్ చెస్ క్రీడలో అరుదైన రికార్డును సాధించారు. క్రీడారంగంలో విశేష ఖ్యాతిగాంచిన రాయ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 15 నిమిషాల 52 సెకండ్స్ లలో 93 బ్యాక్ ర్యాంక్ చెక్ మేట్స్ ను పరిష్కరించడంతో పాటు, 1 గంట 9 నిమిషాల 9 సెకండ్స్ లలో 21 చెస్ బోర్డ్ లను అమర్చి, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్) లో రెండు ప్రపంచ రికార్డులను సాధించి శ్రేయాన్ష్ కృష్ణ పటేల్ చరిత్ర సృష్టించాడు. రెండు సంవత్సరాల 11 నెలల అత్యంత పిన్న వయస్సులోనే ఈ రికార్డును సాధించిన ఏకైక బాలుడిగా ఖ్యాతికెక్కాడు. జూబ్లీహిల్స్ లోని ఎమ్మెల్యేస్ అండ్ ఎంపీస్ కాలనీ కల్చరల్ సెంటర్ లో విశేష అతిథుల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో అత్యంత ఉత్కంఠ నడుమ శ్రేయాన్ష్ కృష్ణ పటేల్ తన అద్భుత నైపుణ్యాలతో నిర్ణీత సమయంలో శ్రేయాన్ష్ కృష్ణ రికార్డును సాధించాడు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గారు, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శ్రేయాన్ష్ కృష్ణ పటేల్ ను వెన్నుతట్టి ప్రోత్సాహించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, చెస్ లో వరల్డ్ రికార్డ్ సాధించిన శ్రీయాన్ష్ మురళీ కృష్ణ పటేల్ కు అభినందనలు తెలిపారు. శ్రీయాన్ష్ పటేల్ 'నభూతో నా భవిష్యత్' అన్నట్లుగా ఆడటం తెలంగాణకు గర్వకారణమని అన్నారు. జూన్ లో బ్రిటన్ పార్లమెంట్ లో అవార్డు అందుకోనున్న శ్రీయాన్ష్ కు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడలకు అండగా ఉంటామని ప్రకటించారు. మంత్రి సురేఖ గారు మాట్లాడుతూ, శ్రేయాన్ష్ కృష్ణ ఎంతో ఓపికగా పజిల్స్ పరిష్కరించడంతో పాటు చెస్ బోర్డులను చాలా చక్కగా అమర్చడం అందరినీ ఉద్వేగానికి గురి చేసిందని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ ఆనంద భాష్పాలు రాల్చారు. శ్రీయాన్ష్ ఆధ్యాత్మిక చింతన, క్రీడా నైపుణ్యాలు తమను అబ్బురపరుస్తాయని శ్రీయాన్ష్ అమ్మగారు కొండా సుస్మిత పటేల్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ దిశగా అతని ప్రతిభా సామర్థ్యాలను మరింతగా ప్రోత్సహించి, శ్రీయాన్ష్ లక్ష్యాల సాధనకు తమవంతు సహకారం అందిస్తామని సుస్మిత తెలిపారు. రాయ్ చెస్ అకాడమీ వ్యవస్థాపకుడు, కోచ్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, శ్రీయాన్ష్ సాధన కేవలం రికార్డు కోసం కాదనీ, అతని మేధ భవిష్యత్ తరాలకు ప్రేరణ అని అన్నారు. సరైన మార్గదర్శకత్వం ఉంటే పిల్లలలో అపారమైన సామార్థ్యాన్ని వెలికి తీయవచ్చుని ఈ సంఘటన నిరూపిస్తుందని తెలిపారు. రానున్న జూన్ లో వరల్డ్ బుక్ ఆఫ్ లండన్ ద్వారా శ్రేయాన్ష్ కృష్ణ పటేల్ బ్రిటీష్ పార్లమెంట్లో సత్కారంతో పాటు సర్టిఫికెట్ ను పొందనున్నట్లు తెలిపారు. రెండు ప్రపంచ రికార్డులను సాధించిన కొండా శ్రీయాన్ష్ పటేల్ కు రాయ్ చెస్ అకాడమీ తరఫున అతిథుల చప్పట్ల మధ్య ట్రోఫీలు, సర్టిఫికెట్ లను మంత్రి కొండా సురేఖతో కలిసి క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రదానం చేశారు.

## పశ్చిమ బెంగాల్‌లోని చుంచురా నియోజకవర్గ కాంగ్రెస్ అబ్జర్వర్‌గా సిరాజ్ హుస్సేన్



**కరీంనగర్ టౌన్,ఏప్రిల్7(ది క్రైమ్ న్యూస్):** పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని చుంచురా అసెంబ్లీ నియోజకవర్గానికి కాంగ్రెస్ అబ్జర్వర్ గా కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఏఐసీసీ మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్ గర్హి ఉత్తర్వులు జారీ చేశారు. అబ్జర్వర్లు తక్షణం వెళ్లి అసెంబ్లీ నియోజకవర్గంలో నాయకులతో సమన్వయం చేసుకొని కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా సిరాజు హుస్సేన్ మాట్లాడుతూ అధిష్టానం తన సేవలను గుర్తించి ఈ అవకాశం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి చుంచురా నియోజకవర్గంలో నాయకులు కార్యకర్తలతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్తామన్నారు. చుంచురా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన అధిష్టానం పెద్దలకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, సీనియర్ నాయకులు అందరికీ పేరుపేరునా సిరాజు హుస్సేన్ కృతజ్ఞతలు తెలిపారు.

## త్రీడి ఆర్టిస్ట్ కి అంతర్జాతీయ అవార్డ్

- శ్రీలంకలో శ్రీలంక ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో ప్రధానం
- శ్రీలంక లో త్రీడి ఆర్ట్ ని పరిచయం చేసే దిశగా చర్చలు
- కృష్ణకి పలువురు ప్రముఖుల ప్రశంసలు





**రామగిరి, ఏప్రిల్ 07(ది క్రైమ్ న్యూస్):-** ప్రముఖ అంతర్జాతీయ త్రీడీ ఆర్టిస్ట్, జేఎన్టీయూ మంథని కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కి అరుదైన గౌరవం దక్కింది. శ్రీలంక వేదికగా ఎనిఎల్ఫ్ గ్రూప్స్ బెంగళూరు వారు నిర్వహించే అంతర్జాతీయ అవార్డ్స్, గ్లోబల్ ఐకాన్ అవార్డ్ కి కృష్ణని ఎంపిక చేశారు. మే 8 న శ్రీలంకలో శ్రీలంక ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో ఈ అవార్డ్ ను ప్రధానం చేయనున్నారు. ఈ సందర్భంగా శ్రీలంకలో త్రీడి ఆర్ట్ ని పరిచయం చేసే దిశగా చర్చలు కూడా జరుగుతున్నాయని కృష్ణ తెలిపారు. తెలంగాణ గౌరవాన్ని , దేశ ప్రతిష్టను ప్రపంచ దేశాల్లో చాటుతున్న కృష్ణ ను ప్రభుత్వ సలహాదారు కే. కేశవ రావు తన నివాసంలో ప్రశంసించారు. తెలంగాణ డైరెక్టర్ అఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, డా.నరేంద్ర కుమార్ తన ఆఫీసులో కృష్ణను ఘనంగా సన్మానించి, కృష్ణ చేసే పని అద్భుతమని, ఇలాంటి త్రీడి చిత్రాలను తను ఎప్పుడూ చూడలేదని ప్రశంసించారు. ఈ సందర్భంగా కృష్ణ యూనివర్సిటీ పెద్దలకు, తోటి ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్‌లో చేరికలు... ఆహ్వానించిన ఎమ్మెల్యే



**బెజ్జంకి, ఏప్రిల్ 7(ది క్రైమ్ న్యూస్):** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి గ్రామ పంచాయతీకి చెందిన 5మంది వార్డు సభ్యులతో పాటు ముగ్గురు నాయకులు కాంగ్రెస్ లో చేరగా మంగళవారం ఎల్ఎండీలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వాళ్ళకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.వార్డు సభ్యులు ముత్త బీరయ్య, దయ్యాల ఐలవ్వ, ఏనుగుల అనిత, నల్లగొండ రాములు, జనగం లక్ష్మి నాయకులు ఐలయ్య, అశోక్ లక్ష్మయ్య కాంగ్రెస్ చేరిన వారిలో ఉన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్,కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, నాయకులు దయ్యాల ఐలేష్, బైర సంతోష్, గుంటి అంజి, గుంటి అశోక్, గుంటి ఓదెయ్య, ఒగ్గు శ్రీను తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బీర్ తాగితే ఒంటికి చలువ చేస్తుందా..?

ఎండాకాలం వస్తే మద్యం ప్రియులు బీర్లు తెగ సేవిస్తారు. అదెంటి అంటే.. బీర్ తాగితే ఒంటికి చలవు చేస్తుందని చెబుతారు. కానీ ఇది ఎంతమాత్రం కరెక్ట్ కాదంటున్నారు డాక్టర్లు. అందుకు ఎలాంటి శాస్త్రీయమైన ఆధారాలు లేవంటున్నారు. అంతేకాదు బీర్ తాగితే గుండెకు మంచిదనే ప్రచారాన్ని కూడా కొట్టి పారేస్తున్నారు. ఇక కొందరు బీర్ తాగడం వల్ల కిడ్నీల్లో రాళ్లు తగ్గుతాయని చాలామంది నమ్ముతారు. ఇది నిజం కాదని నెఫ్రోలాజిస్టులు నొక్కి చెబుతున్నారు. అయితే బీర్ తాగేవారు లావు అవుతారు అనడంలో కొంతమేర వాస్తవం ఉంది. అయితే బరువు పెరిగేందుకు ఇది మంచి పద్దతి కాదు. ఒక గ్రాము ఆల్కాహాల్ సేవిస్తే 7 కేలరీలు శరీరానికి అందుతాయి.. ఇక బీర్‌ను తలకు పట్టిస్తే.. షాంపులా వాడితే జుట్టు పెరుగుతుందన్నది మరికొందరి వాదన. జుట్టు కుదుళ్ల నుంచే బలంగా ఉండాలి. జనవరిలో విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం.. ఎంత మొత్తంలో ఆల్కాహాల్ తీసుకున్నా కూడా అది ఆరోగ్యానికి చేటే అని వెల్లడించింది. ఆల్కాహాల్ సేవనం పలు రకాల క్యాన్సర్లకు కారణం అవుతుంది. అయితే బీర్ కాకుండా ఇతర రకాల ఆల్కాహాల్ తీసుకునే వారికి లివర్ 5 ఏళ్లలో దెబ్బతింటే, బీర్ తాగే వారికి 10 సంవత్సరాల్లో దెబ్బతింటుందని కొందరు డాక్టర్స్ చెబుతున్నారు.

# వారానికో బాతు గుడ్డు తినండి..!

## ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే అస్సలు వదులుకోరు



బాతు గుడ్లు వివిధ ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయి. కోడి గుడ్లకు రుచికరమైన, పోషకమైన ప్రత్యామ్నాయం బాతుగుడ్లు. వాటిలో ప్రోటీన్, విటమిన్లు, విటమిన్ బి12, విటమిన్ డి, ఐరన్, సెలీనియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. అదనంగా బాతు గుడ్లు, కోడి గుడ్ల కంటే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాల సాంద్రతను కలిగి ఉంటాయి. ఇవి గుండె, మెదడుకు మేలు చేస్తాయి. బాతు గుడ్లు కొంతమందికి సులభంగా జీర్ణమవుతాయి. మీ ఆహారంలో బాతు గుడ్లను చేర్చుకోవడం వల్ల మీ మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. వారానికి ఒకసారి బాతు గుడ్లు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను ఇక్కడ తెలుసుకుందాం.. కోడి గుడ్ల కంటే రెట్టింపు ప్రయోజనం బాతు గుడ్లు వల్ల కలుగుతుంది. బాతు గుడ్లలో ప్రొటీన్లు, విటమిన్లు, విటమిన్ బి12, విటమిన్ డి, ఐరన్, సెలీనియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. అంతే కాదు ఇందులో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ కూడా చాలా ఎక్కువ. మన గుండె, మెదడు, జ్ఞాపకశక్తికి ఈ ప్రయోజనాలన్నీ చాలా మంచివి. బాతు గుడ్లు అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేస్తాయి. ఇది బరువు నిర్వహణ, కండరాల పెరుగుదల, వ్యాయామం తర్వాత కోలుకోవడానికి సహాయపడుతుంది. బాతు గుడ్లు చాలా తేలికగా జీర్ణమవుతాయి. కోడి గుడ్ల కంటే బాతు గుడ్లు చాలా ప్రయోజనాలను కలిగి ఉన్నాయని, పరిమాణం పరంగా మరింత మెరుగ్గా ఉంటాయి. ఈ విషయంలో ఎటువంటి సందేహం లేదు. వారానికి ఒకసారి బాతు గుడ్డు మీ ఆహారంలో చేర్చుకోవడం మంచిది. యాంటీఆక్సిడెంట్ లక్షణాలు.. బాతు గుడ్లలో యాంటీఆక్సిడెంట్ చర్యలో గణనీయమైన పెరుగుదల గమనించబడింది. బాతు గుడ్లలో ఉండే కెరోటినాయిడ్స్, అమినో యాసిడ్స్ యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది. క్యాన్సర్ నివారణకు బాతు గుడ్లను ముఖ్యమైన ఆహారంగా తీసుకోవచ్చు. కోడి గుడ్ల కంటే డీసాల్టెడ్ బాతు గుడ్డులోని తెల్లసొన మంచి కాల్షియం శోషణను కలిగి ఉంటుంది. బరువు నియంత్రణతో పాటు, బాతు గుడ్లు కండరాల ఆరోగ్యానికి, బలానికి సహాయపడతాయి. వ్యాయామం తర్వాత వారానికి ఒకసారి బాతు గుడ్లు తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. బాతు గుడ్లు కండరాల బలాన్ని పెంచుతుంది. కండరాల నొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి.



## ఎండు ద్రాక్ష నీరు ఇలా తాగారంటే.. కేవలం 10 రోజుల్లోనే ఆ సమస్యలన్నీ పరార్..!



ప్రస్తుత కాలంలో ఎంతో మంది ఎదుర్కొంటున్న సమస్యల్లో అధిక బరువు కూడా ఒకటి. అధిక బరువు కారణంగా చాలా మంది అనేక అనారోగ్య సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. వెయిట్ లాస్ అయ్యేందుకు ఎన్నో రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. వ్యాయామం, వాకింగ్, హెల్దీ డైట్, జిమ్ ఇలా చాలానే ట్రై చేస్తున్నారు. అయితే కొన్ని రకాల సింపుల్ చిట్కాలతో కూడా వెయిట్ లాస్ అవ్వొచ్చని నిపుణులు చెబుతున్నారు. వెయిట్ లాస్ అయ్యేందుకు ఎండు ద్రాక్ష వాటర్ ఎంతగానో సహకరిస్తుంది. ప్రతిరోజూ ఎండు ద్రాక్ష నీరు తాగుతూ, మంచి డైట్ మెయిన్ టైన్ చేస్తూ.. వ్యాయామం చేస్తే మీకు కేవలం 10 రోజుల్లోనే రిజల్ట్ కనిపిస్తుంది. ఇలాంటి వాటర్ తాగడం వల్ల మీ బాడీ కూడా ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంటుంది. మరి ఇంకా ఎండు ద్రాక్ష నీటిని తీసుకుంటే ఎలాంటి లాభాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం. బాడీని డిటాక్సిఫికేషన్ చేస్తుంది: ఎండుద్రాక్ష నీటిని తాగడం వల్ల శరీరం డీటాక్సిఫై అవుతుంది. రోజు వారీ జీవితంలో మనకు తెలియకుండానే కాలుష్యం, తినే ఆహారం ఇలా రకరకాల కారణాల వల్ల శరీరంలో మలినాలు అనేవి చేరతాయి. కాబట్టి ఎండు ద్రాక్ష నీటిని తాగడం వల్ల శరీరంలో ఉండే మలినాలు బయటకు పోతాయి. శరీరం ఫ్రీ రాడికల్స్‌తో పోరాడే శక్తి కూడా లభిస్తుంది. నిద్ర లేమి సమస్యలను దూరం చేస్తుంది: బరువు పెరిగేందుకు నిద్ర లేమి సమస్యలు కూడా ఒక కారణంగా ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. సరైన నిద్ర లేకపోతే.. తిన్నది అరగక.. పొట్టలో కొవ్వు అనేది నిల్వ ఉండిపోతుంది. అంతే కాకుండా గ్యాస్ అసిడిటీ సమస్యలు కూడా వస్తాయి. కాబట్టి మీరు ఎండు ద్రాక్ష నీటిని తాగితే నిద్ర లేమి సమస్యల్ని దూరం చేస్తుంది. ఎలక్ట్రోలైట్ సమతుల్యత: ఎండు ద్రాక్ష నీటిలో పొటాషియం, మెగ్నీషియం వంటివి లభ్యమవుతాయి. ఇవి శరీరంలోని ద్రవాల స్థాయిల్ని కంట్రోల్‌లో ఉంచుతుంది. చెమట వల్ల కోల్పోయిన శక్తి ఈ నీళ్ల వల్ల తిరిగి వస్తుంది. నాడీ వ్యవస్థ పనితీరు, కండరాల తీరును సరి చేస్తుంది. గట్ హెల్త్: ఎండు ద్రాక్ష నీరు తాగడం వల్ల గట్ హెల్త్ కూడా మెరుగు పడుతుంది. శరీరంలో నుంచి మలినాలన్నీ బయటకు పంపుతుంది. ఎండు ద్రాక్షలో ఉండే ఫైబర్ జీర్ణ శక్తిని, మలబద్ధకం వంటి సమస్యలు రాకుండా చేస్తుంది. వెయిట్ లాస్: ఎండు ద్రాక్ష నీరు తాగడం వల్ల తక్కువ రోజుల్లోనే బరువు తగ్గుతారు. ఎండు ద్రాక్ష నీటిలో ఫైబర్ కంటెంట్ మెండుగా ఉంటుంది. కాబట్టి ఈ నీటిని తీసుకుంటే కడుపు నిండిన భావన కలుగుతుంది. గోరు వెచ్చటి నీటిలో 3 లేదా 4 ఎండు ద్రాక్షను వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం లేవగానే ఆ నీటిని తాగి ఎండుద్రాక్ష తినాలి.

## క్యాన్సర్ భూతాన్ని పారదోలే అద్భుత ఫలం.. ఎక్కడ కనిపించినా వదిలిపెట్టకండీ!

ఆప్రికాట్ పండు చాలా రుచికరమైన పండు. యాంటీఆక్సిడెంట్లతో నిండిన ఈ పండులో పోషకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలకంగా వ్యవహరిస్తుంది. వీటిని రోజు వారీ ఆహారంలో క్రమం తప్పకుండా తింటే ఎన్నో ప్రయోజనాలు పొందుతారు. ఆప్రికాట్ పండును సూపర్ ఫుడ్ అని కూడా అంటారు. ఇందులో చాలా తక్కువ కేలరీలు ఉంటాయి. అయితే పోషకాలు మాత్రం పుష్కలంగా ఉంటాయి. ఆప్రికాట్ పండ్లలో బీటా కెరోటిన్, లుటిన్, పొటాషియం, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ, జియాక్సంతిన్ అధికంగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఆప్రికాట్ పండ్లు కళ్లకు కూడా చాలా మేలు చేస్తాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందులో బీటా కెరోటిన్, విటమిన్ ఎ, జియాక్సంతిన్ ఉంటాయి. ఈ మూడు పదార్థాలు కళ్లకు ఎంతో మేలు చేస్తాయి. ఆప్రికాట్‌పండ్లు కంటిశుక్లం, రేచీకటి ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఆప్రికాట్ పండ్లలో వివిధ రకాల ఫైబర్ ఉంటుంది. కాబట్టి ఈ పండు తింటే జీర్ణం సులువుగా కడుపు క్లీన్ చేస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఈ పండు ఎంతగానో ఉపయోగపడుతుంది. బీటా-కెరోటిన్, లుటిన్, జియాక్సంతిన్, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ, యాంటీఆక్సిడెంట్లు వంటి పదార్థాలు శరీరంలోని యాంటీ-క్యాన్సర్ ఏజెంట్లుగా పనిచేస్తాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ నుండి కణాలను రక్షిస్తాయి. ఆప్రికాట్ పండ్లు శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచుతాయి. ఆప్రికాట్ పండ్లలో అధికంగా పొటాషియం ఉంటుంది. కాబట్టి ఇది రక్తపోటును పెంచదు. ఆప్రికాట్ కూడా కాలేయం దెబ్బతినకుండా కాపాడుతుంది. ఈ పండు కాలేయ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆప్రికాట్ పండ్లు శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ తగ్గకుండా కాపాడుతాయి. అంటే మీరు ఎంత కష్టపడి పనిచేసినా శరీరం బలహీనపడకుండా ఉంటుంది.

## తమలపాకును నీళ్లలో మరిగించి తాగితే ఏమవుతుందో తెలుసా..? నమ్మలేని లాభాలు..





ఇందుకోసం ముందుగా పొయ్యి మీద ఒక పాత్ర పెట్టి, ఒక గ్లాసు నీళ్లు పోసి, ఒక తమలపాకును ముక్కలుగా కట్ చేసి అందులో వేయాలి. 5 నుంచి7 నిమిషాలు మరిగించి ఆ నీటిని వడకట్టి తాగాలి. మలబద్ధకం సమస్య ఉన్నవారికి ఈ తమలపాకు నీరు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పేగు కదలికలు బాగా జరిగేలా చేస్తుంది. శరీరంలో వాపులను తగ్గిస్తుంది. తమలపాకులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉండటంవల్ల ఛాతీలో పేరుకుపోయిన కఫాన్ని తొలగిస్తుంది. అలాగే జలుబు, దగ్గు, గొంతు నొప్పి నుండి ఉపశమనం కలిగిస్తుంది. మధుమేహం నియంత్రణలో కూడా తమలపాకు నీరు తోడ్పడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచటమే కాకుండా, మధుమేహం కారణంగా వచ్చే సమస్యలను కూడా తగ్గిస్తుంది. చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలను కూడా తమలపాకు నీరు నియంత్రిస్తుంది. తద్వారా గుండె ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. తమలపాకులో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉండుటవల్ల ఆస్తమాను కూడా అదుపులో ఉంచుతుంది. అంతేగాక తమలపాకును మౌత్ ఫ్రెషనర్‌గా ఉపయోగిస్తున్నారు. ఇది నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. తమలపాకు నోటిలో బ్యాక్టీరియా పెరుగుదలను నిరోధిస్తుంది. అయితే తమలపాకు నీటిని ఎప్పుపడితే అప్పుడు తాగడం కూడా మంచిదికాదు. రోజులో ఒకసారి మాత్రమే తీసుకోవాలి.

## వయసు పెరిగినా యవ్వనంగా కనిపించాలంటే.. ఈ పండ్లు తినండి! ఏంజెల్స్‌లా మెరిసిపోతారు

ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ యవ్వనంగా, అందంగా కనిపించాలని కోరుకుంటారు. దీని కోసం అనేక రకాల చికిత్సలు కూడా తీసుకుంటూ ఉంటారు. బ్యూటీ పార్లర్లలో రకరకాల చర్మ సంరక్షణ ఉత్పత్తులను వినియోగిస్తుంటారు. కానీ ప్రతీసారి ఆశించిన ఫలితాలు అందకపోవచ్చు. నిజానికి, చర్మం యవ్వనంగా కనిపించాలంటే కొన్ని ఆహారాలను డైట్‌లో చేర్చుకోవాలి. అలాగే చెడు జీవనశైలి కారణంగా కూడా చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. ఏది ఏమైనప్పటికీ, వేసవి కాలంలో సూర్యుని కిరణాల కారణంగా చర్మం దెబ్బతింటుంది. అటువంటి పరిస్థితిలో చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. ఆహారపు అలవాట్లు సరిగా లేకపోవడం వల్ల అతి చిన్న వయసులోనే వృద్ధాప్య సంకేతాలు కనిపిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖంపై, ముడతలు, మచ్చలు కనిపించడం ప్రారంభిస్తాయి. చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే ఏయే ఆహారాలు తీసుకోవాలో ఇక్కడ తెలుసుకుందాం.. బెర్రీ పండ్లు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు బెర్రీలలో పుష్కలంగా లభిస్తాయి. స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీస్, బ్లాక్బెర్రీస్ తినడం వల్ల చర్మం యవ్వనంగా ఉంటుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మంలో వేగవంతమైన మార్పులను నెమ్మదించేలా చేస్తాయి. దీనితో పాటు బెర్రీలు ఆక్సీకరణ ఒత్తిడిని తొలగించడంలో కూడా సహాయపడతాయి. డ్రై ఫ్రూట్స్ బాదం, వాల్‌నట్, జీడిపప్పు, వాల్‌నట్, గుమ్మడికాయ గింజలు వంటి డ్రై ఫ్రూట్స్ చర్మానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. చర్మానికి మేలు చేసే డ్రై ఫ్రూట్స్ రోజూ తినడం వల్ల ఇందులో ఉండే విటమిన్-ఇ, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్‌లు పుష్కలంగా చర్మానికి అందుతాయి. కొవ్వు చేప నాన్ వెజ్ ఫుడ్ ఇష్టపడే వారు చర్మాన్ని కాపాడుకోవడానికి ఫ్యాటీ ఫిష్ ను తమ డైట్ లో చేర్చుకోవచ్చు. చర్మంపై కనిపించే వృద్ధాప్య సంకేతాలను నివారించడంలో ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కొవ్వు



చేపలలో ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని యవ్వనంగా ఉంచడంలో సహాయపడతాయి. వీటితోపాటు గ్రీన్ టీ ద్వారా కూడా చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. గ్రీన్ టీని రెగ్యులర్ గా తీసుకోవడం వల్ల చర్మ కణాలు ఆరోగ్యంగా ఉంటాయి.

## అధిక రక్తపోటు ఎంత ప్రమాదమో తెలుసా? నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం తప్పదంటున్న నిపుణులు



హైపర్ టెన్షన్ కూడా ఓ విధమైన సైలెంట్ కిల్లర్. అధిక రక్తపోటు ప్రాణాలను నెమ్మదిగా హరిస్తుంది. మీకూ అధిక రక్తపోటు సమస్య ఉంటే ప్రతిరోజూ తప్పకుండా మెడిసిన్ తీసుకోవాలి. అధిక రక్తపోటు వల్ల గుండెపోటు, పక్షవాతం వంటి సమస్యలు వస్తాయి. అసలు అధిక రక్తపోటు ఎందుకు దాడి చేస్తుంది? ఈ సమస్యను ఎలా నియంత్రించవచ్చు వంటి వివరాలు నిపుణుల మాటల్లో తెలుసుకుందాం. బిర్లా హార్ట్ హాస్పిటల్‌లోని కార్డియాలజీ విభాగం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సబ్యసాచి పాల్ మాట్లాడుతూ.. రక్తపోటు వెనుక అనేక జీవనశైలి కారకాలను వివరించారు. వీటిలో వ్యాయామం నుంచి ఊబకాయం, ధూమపానం వరకు అనేక కారకాలు ఉన్నాయి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుందని డాక్టర్ సబ్యసాచి పాల్ అంటున్నారు. కానీ రోజువారీ ఏరోబిక్ వ్యాయామం రక్తపోటును పెంచుతుంది. ముఖ్యంగా రక్తపోటు అదుపులో లేని వారు, శరీర బరువు పెరిగినవారికి, ఊబకాయంతో బాధపడుతున్నవారికి గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది. ఊబకాయం కారణంగా అబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా తరచుగా సంభవిస్తుంది. ఇది రక్తపోటు ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. ప్రిజర్వేటివ్స్, చక్కెర, ఉప్పుతో కూడిన ప్రాసెస్ చేసిన ఆహారాలు రక్తపోటుకు కారణమని డాక్టర్ సబ్యసాచి పాల్ చెబుతున్నారు. ఇందులో అధిక మొత్తంలో కేలరీలు, సోడియం ఉంటుంది. ఇవి అధిక రక్తపోటుతో పాటు కిడ్నీ సమస్యలు, మధుమేహం ప్రమాదాన్ని పెంచుతాయి. అధిక రక్తపోటు ప్రమాదాన్ని నివారించడానికి ఫాస్ట్ ఫుడ్ మానుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. రక్తపోటు ప్రమాదాన్ని నివారించడానికి, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలని డాక్టర్ పాల్ సూచిస్తున్నారు. జీవనశైలి కారకాలు మాత్రమేకాకుండా, రక్తపోటుకు మరొక కారకం కూడా ఉంది. అధిక రక్తపోటుకు ఒత్తిడి కూడా కారణం. ఒత్తిడిని తగ్గించుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం ద్వారా అధిక రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చు. మీరు హైపర్‌టెన్షన్ రోగి అయితే, ప్రతిరోజూ తప్పనిసరిగా మందులు వాడాల్సి ఉంటుంది. బిఎమ్ బిర్లా హార్ట్ హాస్పిటల్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ అంజన్ సియోటియా ఈ విషయాన్ని సూచిస్తున్నారు. చాలా మంది హైపర్ టెన్షన్ కు చికిత్స తీసుకోరని డాక్టర్ అంజన్ అంటున్నారు. సగం కంటే ఎక్కువ మందికి తమకు అధిక రక్తపోటు ఉందనే విషయమే తెలియదు. ఎందుకంటే వారు ఎప్పుడూ రక్తపోటును క్రమం తప్పకుండా టెస్ట్ చేయించుకోరు. అలాగే దీనిపై అవగాహన ఉన్న రోగులలో కూడా సగం మంది రోగులు రోజూ మందులు తీసుకోరు. ఈ కారణంగా మరణాల సంఖ్య పెరుగుతుంది. చికిత్స చేయకపోతే సమస్య మరింత తీవ్రతరం అవుతుంది. దీంతో పక్షవాతం, గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి తరచుగా రక్తపోటు పరీక్షించుకోవాలి. అలాగే మందులు తీసుకోవాలని సిఫార్సు చేస్తున్నారు. ఇలాచేస్తే రక్తపోటును నియంత్రించడం సులభతరం అవుతుంది.

# అమ్మకానికి జాతీయ రహదారులు..

# మహారాష్ట్ర, ఏపీలోని ఆస్తుల నగదీకరణ

● **ఎన్‌హెచ్ఐటీ రూ.6,221 కోట్ల ఆఫర్‌కు ఎన్‌హెచ్ఏఐ సై**

**న్యూఢిల్లీ:** జాతీయ రహదారి ఆస్తుల నగదీకరణకు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) మరోసారి సిద్ధమైంది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ (ఏపీ)లలో 310.35 కిలోమీటర్ల పొడవున ఉన్న రెండు హైవే సెక్షన్ల కోసం నేషనల్ హైవేస్ ఇన్‌ఫ్రా ట్రస్ట్ (ఎన్‌హెచ్ఐటీ) రూ.6,220.90 కోట్లను ఆఫర్ చేసింది. దీనికి ఎన్‌హెచ్ఏఐ అంగీకరించినట్టు కేంద్ర రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన ఓ అధికారిక ప్రకటనలో తెలియజేసింది. ఇప్పటికే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) జాతీయ రహదారుల ఆస్తుల నగదీకరణ ద్వారా దాదాపు రూ.28,077 కోట్లను ఎన్‌హెచ్ఏఐ సమీకరించిన విషయం తెలిసిందే. కాగా, తాజా డీల్‌లో మహారాష్ట్రలోని జాతీయ రహదారి 53పై 255.97 కిలోమీటర్ల పొడవున ఉన్న అమరావతి-చిఖిలీ-టార్సోడ్ సెక్షన్, ఏపీలోని జాతీయ రహదారి 16పై 54.38 కిలోమీటర్ల పొడవున ఉన్న గుండుగొలను-చిన్న అవుతపల్లి సెక్షన్‌లు సేల్ అవుతున్నాయి. ఇదిలావుంటే ఎన్‌హెచ్ఐటీ అనేది ఓ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్). దీన్ని ఎన్‌హెచ్ఏఐ స్పాన్సర్ చేస్తున్నది. ఎన్‌హెచ్ఐటీ ద్వారా జరిగిన మొత్తం ఆస్తుల నగదీకరణ విలువ రూ.49,858 కోట్లుగా ఉన్నది. ఎన్‌హెచ్ఐటీ యూనిట్లు దేశీయ ప్రధాన స్టాక్ మార్కెట్లైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో నమోదైయ్యాయి. ఇదిలావుంటే పర్యావరణ ఒత్తిడిని తగ్గించేందుకు దేశంలోని జాతీయ



రహదారుల పొడవున బీ కారిడార్లను ఎన్‌హెచ్ఏఐ అభివృద్ధి చేయనున్నది. తేనెటీగలు, ఇతర పరాగ సంపర్కాల సాయంతో ఏడాదంతా జాతీయ రహదారుల వెంబడి పచ్చదనం, పూలమొక్కలతో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టనున్నామని మంగళవారం ఓ అధికారిక ప్రకటనలో కేంద్రం వెల్లడించింది.

# మెరిసిన బ్యాంకింగ్ షేర్లు.. సెన్సెక్స్ 650, నిఫ్టీ 212 పాయింట్లు వృద్ధి

**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ రెండూ 0.8 శాతం మేర పుంజుకున్నాయి. విద్యుత్తు, బ్యాంకింగ్, ఇతర ఆర్థిక రంగ షేర్లకు మదుపరుల కొనుగోళ్ల మద్దతు లభించడం కలిసొచ్చింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 650.39 పాయింట్లు లేదా 0.79 శాతం ఎగిసి 83,277.15 వద్ద స్థిరపడింది. ఫలితంగా బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ ఈ ఒక్కరోజే రూ.3,11,982.13 కోట్లు పెరిగి రూ.4,68,58,625.33 కోట్లకు చేరింది. ఇక నిఫ్టీ 211.65 పాయింట్లు లేదా



0.83 శాతం ఎగబాకి 25,682.75 వద్ద నిలిచింది. అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు మదుపరుల సెంటిమెంట్‌ను బలపర్చాయని ట్రేడర్లు చెప్తున్నారు. ముడి చమురు ధరల్లో స్థిరత్వం కూడా మార్కెట్ల లాభాలకు దోహదం చేసిందంటున్నారు. కాగా, సెన్సెక్స్ షేర్లలో పవర్‌గ్రిడ్ విలువ గరిష్ఠంగా 4.45 శాతం పెరిగింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎన్టీపీసీ, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, కొటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్బీఐ షేర్లు లాభపడ్డాయి. రంగాలవారీగా పవర్, యుటిలిటీస్, బ్యాంకింగ్, రియల్టీ షేర్లు ఇన్వెస్టర్లను ఆకట్టుకున్నాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.95 శాతం పెరుగగా, స్మాల్‌క్యాప్ 0.16 శాతం పడిపోయింది.

# ఐపీవోకి గౌడియం ఐవీఎఫ్




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లోకి మరో సంస్థ అడుగుపెట్టబోతున్నది. ఫెర్టిలిటీ సేవల సంస్థ గౌడియం ఐవీఎఫ్ అండ్ మహిళా హెల్త్ లిమిటెడ్..ఐపీవో ప్రతిపాదనకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. షేరు ధరల శ్రేణిని రూ.75-79 గా నిర్ణయించింది. ఈ నెల 20న ప్రారంభంకానున్న వాటాల విక్రయం ఈ నెల 24న ముగియనున్నది. రెండు శాతానికి సమానమైన షేర్లను బహిరంగా మార్కెట్లో విక్రయించడం ద్వారా సంస్థకు రూ.165 కోట్ల నిధులు సమకూరనున్నాయి. ఫెర్టిలిటీ విభాగం నుంచి వస్తున్న తొలి ఐపీవో సంస్థ ఇదే కావడం విశేషం.

# భెల్‌కు 1,500 కోట్ల ఆర్డర్

**న్యూఢిల్లీ:** విద్యుత్ పరికరాల తయారీ సంస్థ భెల్ మరో భారీ ప్రాజెక్టును చేజిక్కించుకున్నది. స్టీల్ ఆథార్టీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్) నుంచి రూ.1,200-1,500 కోట్ల విలువైన విద్యుత్ ప్లాంట్ ప్రాజెక్టు లభించినట్టు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఇందుకు సంబంధించి ఇరు సంస్థల మధ్య నేడు అధికారిక ఒప్పందం జరిగింది. బర్న్‌పూర్‌లో సెయిల్ సంయుక్తంగా 4.08 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన స్టీల్ ప్లాంట్‌లోనే ఈ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నది. ఈ ప్రాజెక్టు వచ్చే 39 నెలల్లో అందుబాటులోకి రానున్నది.

## 3 నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు.. జనవరిలో 34.68 బిలియన్ డాలర్లుగా నమోదు

**న్యూఢిల్లీ:** దేశ ఎగుమతులు, దిగుమతుల మధ్య అంతరం అంతకంతకూ పెరిగిపోతున్నది. జనవరిలో 3 నెలల గరిష్ఠాన్ని తాకుతూ వాణిజ్య లోటు 34.68 బిలియన్



డాలర్లుగా నమోదైంది. ఈసారి ఎగుమతులు స్వల్పంగా 0.61 శాతం పెరిగి 36.56 బిలియన్ డాలర్లుగా ఉంటే.. దిగుమతులు మాత్రం 19.2 శాతం ఎగిసి 71.24 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇది వాణిజ్య లోటును ఎగదోసింది. ఇక అధిక ధరల నేపథ్యంలో దిగుమతుల్లో బంగారం, వెండి వాటా గణనీయంగా పెరిగి వరుసగా 12 బిలియన్ డాలర్లు, 2 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ముడి చమురు దిగుమతులు 0.24 శాతం తగ్గి 13.4 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అమెరికాకు తగ్గుముఖం అమెరికాకు భారతీయ ఎగుమతులు గత నెలలో 21.77 శాతం క్షీణించాయి. 6.6 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి. అగ్రరాజ్యం విధించిన అధిక సుంకాల ప్రభావం కనిపించింది. సెప్టెంబర్, అక్టోబర్, డిసెంబర్ నెలల్లోనూ పతనం చూసిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే అమెరికా నుంచి భారత్‌కు జరిగిన దిగుమతులు 23.71 శాతం పెరిగి 4.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

# మార్కెట్లోకి మారుతి ఈ-విటారా.. ప్రారంభ ధర రూ 10.99 లక్షలు




**న్యూఢిల్లీ:** కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ..ఎలక్ట్రిక్ వాహన సెగ్మెంట్‌లోకి ఎట్టకేలకు ప్రవేశించింది. కిందటేడాది చివర్లో ప్రదర్శించిన తన తొలి ఎలక్ట్రిక్ మాడల్ ఈ-విటారాను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.10.99 లక్షలుగా నిర్ణయించింది. బాస్(బ్యాటరీ-యాస్-సర్వీసెస్) ఆప్షన్‌తో కొనుగోలు చేయవచ్చును. ఇందుకోసం కొనుగోలుదారుడు అదనంగా కిలోమీటర్‌కు రూ.3.99 చొప్పున చెల్లించాల్సివుంటుంది. 61 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 543 కిలోమీటర్లు ప్రయాణించనుండగా, 49 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన మాడల్ 440 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. ఆన్‌లైన్‌తోపాటు దేశవ్యాప్తంగా ఉన్న డీలర్ల వద్ద రూ.21 వేలు చెల్లించి ముందస్తుగా ఈ కారును బుకింగ్ చేసుకోవచ్చునని తెలిపింది. ఇందుకోసం సంస్థ 1,100 నగరాల్లో 2 వేల చార్జింగ్ పాయింట్లను ఇప్పటికే ఏర్పాటు చేసింది. 2030 నాటికి దేశవ్యాప్తంగా లక్ష చార్జింగ్ స్టేషన్లను నెలకొల్పాలని లక్ష్యంగా పెట్టుకున్నది. మారుతి చరిత్రలో ఇదొక కీలక మైలురాయి వంటిదని, ఎలక్ట్రిక్ రంగంలో తొలి అడుగుపడిందని, భవిష్యత్తులో ఈ సెగ్మెంట్ మరింత బలోపేతం అయ్యే అవకాశాలున్నాయని మారుతి సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ పార్థో బెనర్జీ తెలిపారు. గడిచిన రెండేండ్లలో ఈవీ మార్కెట్ 4-5 శాతం వృద్ధిని నమోదు చేసుకుంటుందన్నారు. ఈ కారును ఇప్పటికే విదేశాల్లో సుజుకీ మోటర్ కార్పొరేషన్‌తో కలిసి విక్రయిస్తున్నది.


## ఆర్‌సీబీ మహిళా టీమ్‌కు చేతక్ స్కూటర్లు

**పుణె:** ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ బజాజ్ ఆటో లిమిటెడ్... మహిళా టీ-20 లీగ్‌లో గెలుపొందిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మహిళా టీం ప్రతి ఒక్క సభ్యురాలుకు నూతన చేతక్ సీ25ని బహుమతిగా అందచేస్తున్నట్టు సంస్థ ప్రకటించింది. ఇప్పటికే ఆర్‌సీబీ మహిళా టీమ్‌కు భాగస్వామిగా వ్యవహరిస్తున్న చేతక్..తాజాగా ఐపీఎల్ మహిళా టీమ్ విజేతలకు ఉచితంగా స్కూటర్‌ను ఇస్తున్నట్టు కంపెనీ ప్రెసిడెంట్ సుమీత్ నారంగ్ తెలిపారు.



# దిగొస్తున్న పుత్తడి.. 2 శాతం వరకు తగ్గిన తులం ధర

## రూ.5 వేలు దిగొచ్చిన కిలో వెండి



**న్యూఢిల్లీ:** బంగారం, వెండి ధరలు కొండదిగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ లేమి కారణంగా దేశీయంగా ధరలు 2 శాతం వరకు తగ్గుముఖం పట్టాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి. కిలో వెండి రూ.2.45 లక్షలకు దిగిరాగా, బంగారం రూ.1.57 లక్షలకు దిగొచ్చింది. ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించిన సమాచారం ఆధారంగా వెండి రూ.5 వేలు లేదా 2 శాతం తగ్గి రూ.2.45 లక్షలకు పడిపోయినట్టు తెలిపింది. సోమవారం ఈ ధర రూ.2.50 లక్షలుగా ఉన్నది. వెండితోపాటు 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.2,200 లేదా 1.4 శాతం తగ్గి రూ.1,57,000కి తగ్గింది. ఆసియా మార్కెట్లకు సెలవు కావడం, మరోవైపు అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు తగ్గుముఖం పట్టడంతో భవిష్యత్తులో యూఎస్ ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం కూడా ధరలు తగ్గడానికి ప్రధాన కారణాలని చాయిస్ బ్రోకింగ్ కమోడిటీ అనలిస్ట్ కావేరి మోర్ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ వెండి 1.65 డాలర్లు లేదా 5.15 శాతం తగ్గి 73.58 డాలర్లకు పడిపోయింది. అలాగే బంగారం 3.04 శాతం తగ్గి 4,907.70 డాలర్ల వద్ద ఉన్నది. అమెరికా-ఇరాన్ దేశాల మధ్య చర్చలు ప్రారంభం కావడంతో వరుసగా రెండు రోజులుగా అతి విలువైన లోహాల ధరలు దిద్దుబాటునకు గురవుతున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ రీసర్చ్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు.

## రెండోరోజూ లాభాల్లో సూచీలు.. సెన్సెక్స్ 173, నిఫ్టీ 42 పాయింట్ల వృద్ధి



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో దూసుకుపోతున్నాయి. బ్యాంకింగ్, ఐటీ రంగ షేర్ల లభించిన మద్దతుతో వరుసగా రెండోరోజూ మంగళవారం సూచీలు లాభపడ్డాయి. 83,598 నుంచి 82,987 పాయింట్ల మధ్య కదలాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 173.81 పాయింట్లు అందుకొని 83,450.96 వద్ద ముగిసింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.1,52,688.24 కోట్లు పెరిగి రూ.4,70,11,313.57 కోట్లు(5.18 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నాయి. మరో సూచీ నిఫ్టీ 42.65 పాయిం ట్లు ఎగబాకి 25,725.40 వద్ద స్థిరపడింది. ఐటీ రంగ సూచీ కరెక్షన్‌కు గురైనప్పటికీ ఇతర రంగాల షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుతో లాభాలను కొనసాగించాయని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. ఐటీసీ, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, లార్సెన్ అండ్ టుబ్రో, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్, టైటాన్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, సన్‌ఫార్మాస్యూటికల్స్, మారుతి సుజుకీ, ఇండిగో, ఎస్బీఐ, టెక్ మహీంద్రా షేర్లు లాభాల్లో ముగిశాయి. మరోవైపు, ఎటర్నల్, టాటాస్టీల్, ట్రెంట్, రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, కొటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌యూఎల్ షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి.

# ఆంత్రోపిక్- ఇన్ఫీ జట్టు




**న్యూఢిల్లీ:** కృత్రిమ మేధస్సు (ఏఐ)లో సరికొత్త సంచలనం, అమెరికాకు చెందిన కంపెనీ ఆంత్రోపిక్‌తో.. భారతీయ ఐటీ రంగ దిగ్గజ సంస్థల్లో ఒకటైన ఇన్ఫోసిస్ జట్టు కట్టింది. టెలికమ్యూనికేషన్స్, ఆర్థిక సేవలు, తయారీ, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి తదితర కంపెనీల కోసం అత్యాధునిక సంస్థాగత ఏఐ సొల్యూషన్స్‌ను అందుబాటులోకి తేవడం, అభివృద్ధిపర్చడానికి ఆంత్రోపిక్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మంగళవారం ఇన్ఫోసిస్ ప్రకటించింది. ముందుగా టెలికాం రం గంలో ఆంత్రోపిక్ సహకారాన్ని ఇన్ఫోసిస్ తీసుకోనున్నది. ఈ మేరకు ఓ ప్రకటనలో కంపెనీ పేర్కొన్నది. 'ఓ రెగ్యులేటెడ్ ఇండస్ట్రీలో పనిచేసే ఏఐకి, డెమోలో ఉన్న ఏఐ మాడల్‌కు మధ్య చాలా అంతరం ఉన్నది. ఈ దూరాన్ని తొలగించడానికి ఆయా రంగాల్లో సమర్థవంతమైన నైపుణ్యం అవసరం. ఇన్ఫోసిస్‌కు టెలికాం, ఆర్థిక సేవలు, తయారీ రంగాల్లో అలాంటి నైపుణ్యమే ఉన్నది' అని ఆంత్రోపిక్ సీఈవో డారియో అమోడీ అన్నారు.



# అవును పెళ్లయ్యింది.. నలుగురు పిల్లలు

### విమర్శకులకు నటి త్రిష ఘాటు రిప్లై

కొన్ని రోజులుగా నటి త్రిష పేరు సోషల్ మీడియాలో వైరలవుతోన్న విషయం తెలిసిందే. నటుడు, టీవీకే అధినేత విజయ్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా త్రిష సినిమాలు మానేస్తున్నారని నటుడు చిత్రా లక్ష్మణన్ ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో చెప్పడం తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై ఆమె తనదైన స్టైల్‌లో కౌంటర్ ఇచ్చారు. ఇన్‌స్టా స్టోరీలో ఈ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. అవును సినిమాలు మానేశాను. ఒక పెద్ద వ్యాపారవేత్తను పెళ్లి చేసుకొని నలుగురు పిల్లల్ని కన్నాను. మీ ఊహాగానాలకు ఇది సరిపోతుందా?. ఈరోజు మీరు వార్తలు రాసుకోవడానికి ఇది చాలా.. మరేదైనా జోడించమంటారా' అంటూ వ్యంగ్యంగా రాసుకొచ్చారు.. దీంతో ఆమె సినిమాలు మానేయనున్నారంటూ వస్తోన్న వార్తలకు చెక్ పడినట్లైంది. అసలేం జరిగిందంటే.. యూట్యూబ్ వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు చిత్రా లక్ష్మణన్ బదులిచ్చారు. ఇకపై సినిమాల్లో కొనసాగాలని త్రిష అనుకోవడం లేదని.. అవకాశాలనూ అందిపుచ్చుకోవడం లేదన్నారు. దీంతో ఎన్నో ఊహాగానాలు మొదలయ్యాయి. ఆమె పాలిటిక్స్‌పై ఫోకస్ పెట్టనున్నారని వార్తలు వచ్చాయి. తాజా పోస్ట్‌తో వీటికి తనదైన స్టైల్‌లో త్రిష బదులిచ్చారు. ప్రస్తుతం ఆమె సూర్య 'కరుప్పు'(తెలుగులో 'వీరభద్రుడు'), 'విశ్వంభర'లో నటిస్తున్నారు.



# ప్రభాస్‌తో ఆదిత్య ధర్ మూవీ

'ధురంధర్ 2' ఘన విజయం తర్వాత దర్శకుడు ఆదిత్య ధర్ పేరు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి, రికార్డుల సునామీ సృష్టించడంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. తాజా సమాచారం ప్రకారం, ఆదిత్య ధర్ ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుడుతున్నారని తెలుస్తోంది. టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలను కలిపి పాన్ ఇండియా స్థాయిలో ఇండియన్ సినిమాను షేక్ చేసేలా ఓ మల్టీస్టారర్‌ను తెరకెక్కించాలనే ఆలోచనలో ఉన్నారట. ఆ చిత్రంలో ప్రభాస్,సూర్య కలిసి నటించబోతున్నారని బాలీవుడ్ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ హై వోల్టేజ్ మాస్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోందని టాక్. ఇద్దరు స్టార్ హీరోలు కావడంతో వారి పాత్రలకు సమాన ప్రాధాన్యం ఉండేలా పవర్‌ఫుల్ క్యారెక్టర్స్‌ను రూపొందిస్తున్నారని సమాచారం. కథ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో ఉండి, దేశ విదేశాల్లోని పలు ఇంటర్నేషనల్ లొకేషన్స్‌లో షూటింగ్ ఎ÷-లాన్ చేస్తున్నారట.ప్రభాస్‌కు ఉన్న పాన్ ఇండియా మార్కెట్, సూర్యకు ఉన్న నటనా ప్రతిభ ఈ రెండు కలిస్తే బాక్సాఫీస్ వద్ద భారీ సంచలనం ఖాయం అని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్‌లు, ఎమోషనల్ డ్రామా మధ్య మంచి బ్యాలెన్స్ ఉండేలా స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారట. అయితే ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ వార్తలు సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతూ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రభాస్, సూర్య కాంబినేషన్ నిజమైతే ఇది ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక క్రేజీ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని ఫ్యాన్స్ ఇప్పటికే అంచనాలు పెంచుకుంటున్నారు. ఇక అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.






# అనన్య పాండే మూవీ చాంద్ మేరా దిల్

బాలీవుడ్ యువ నటి అనన్యా పాండే, 'కిల్' సినిమాతో మెప్పించిన లక్ష్య జంటగా నటిస్తున్న కొత్త సినిమా 'చాంద్ మేరా దిల్'. ఈ సినిమా మే 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. హైదరాబాద్ నేపథ్యంలో రాబోతున్న ఈ టీజర్ చూస్తుంటే.. ఇదొక స్వచ్ఛమైన క్యాంపస్ లవ్ స్టోరీ అని అర్థమవుతోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ కాలేజీలో ఆరవ్, చాందిని అనే ఇద్దరు విద్యార్థుల మధ్య మొదలైన ప్రేమ, ఆ తర్వాత వారి జీవితాల్లో ఎదురైన మలుపులు, బాధాకరమైన సంఘటనలను ఈ సినిమాలో చాలా ఎమోషనల్‌గా చూపించబోతున్నారు. మరో విశేషమేమిటంటే, ఈ సినిమా షూటింగ్ ఎక్కువ భాగం హైదరాబాద్‌లోనే జరిగింది, ఇది తెలుగు ప్రేక్షకులకు సినిమాపై మరింత ఆసక్తిని కలిగిస్తోంది. సచిన్-జిగర్ అందించిన మ్యూజిక్ సినిమాకు పెద్ద ప్లస్ కానుంది. నిజానికి ఈ సినిమా ఏప్రిల్‌లోనే రిలీజ్ కావాల్సి ఉంది, కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా వేసి, ఇప్పుడు మే 22న థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) RNI NO. APTEL/2006/18964, : .